ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 20 ఆగస్టు 2024 | 5

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పాము హల్‌చల్

రాజమహేంద్రవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలోకి పెద్ద పాము దూరడంతో రోగులు బెంబేలెత్తిపోయారు.కంటి వైద్య వార్డులో సోమవారం మధ్యాహ్నం నర్సుకు ఒక పెద్దపాము కనిపించింది. దీంతో ఆమె పెద్దగా పాము పాము అంటూ కేకలు వేస్తూ బయటికి పరుగుపెట్టింది. సమాచారం తెలియడంతో పెస్ట్ కంట్రోల్ విభాగం ఇన్‌చార్జ్ ఎస్.అప్పన్న అక్కడికి వెళ్లి విషయం బయటకి రానివ్వలేదు. లోపలికి ఎవరిని వెళ్లనివ్వకుండా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఒక రోగి బంధువు వెళ్లి ఆ పాము(జర్రిగొడ్డు)ను కొట్టి బయటపడేశాడు. దీంతో రోగులు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా ఆసుపత్రిలోకి పాము దూరడం తీవ్ర కలకలంరేపింది. నిత్యం రద్దీగా ఉండే ఆసుపత్రిలో పాము ఎలా వచ్చిందనే దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.దీనిపై ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించకపోవడం గమనార్హం.

ఛాయ్..చమక్కు!

ఏ చాయ్ చటుక్కున తాగరా భాయ్..ఈ ఛాయ్ చమక్కులే చూడరా భాయ్.. అని చిరంజీవి అన్నారు.. మంత్రి దుర్గేష్ కూడా ఏ కార్యక్రమానికి వచ్చినా టీ చుక్క గొంతులో పడాల్సిందే.. పెరవలిలో సోమవారం ఒక కార్యక్రమానికి హాజరైన మంత్రి వచ్చీ రావడంతోనే టీ కావాలని కోరారు.. దీంతో జనసేన గ్లాస్‌లో టీ తెచ్చి ఇచ్చారు. దీనిపై విలేకరులు ప్రశ్నించగా.. టీ అంటే తనకు ఎంతో ఇష్టమని.. అది కూడా మా గుర్తు గాజు గ్లాసులో తాగడం అంటే మరీ ఇష్టమని చెప్పుకొచ్చారు.. - పెరవలి



ఇసుగెత్తిస్తోంది!

అందుబాటులో ఇసుక అందనంత ఎత్తులో ధర



ఐదు యూనిట్లు.. రూ.23 వేలు

- ఇసుకపై బాదుడే..బాదుడు
- వరదలతో ర్యాంపుల మూసివేత
- డిమాండ్ మేరకు సరఫరా కాని వైనం
- రెండు ర్యాంపుల నుంచే ఇసుక
- కూటమి ఉచితం..హుష్‌కాకి
- ఐదు యూనిట్లు ఏకంగా రూ.23 వేలు
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు
- నిలిచిపోతున్న భవన నిర్మాణాలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 19 : ఇసుక కష్టాలు ఇంతింతకాదయా.. ప్రభుత్వం ఉచితమన్నా ఎక్కడా ప్రభుత్వం చెప్పినట్టు లేదు.. వేలకు వేలు చెల్లించాల్సిందే.. పాలకులు మారినా కొన్ని సమస్యలకు పరిష్కారం మాత్రం దొరకడం లేదు. ఉచిత ఇసుకపాలసీని కూటమి ప్రభుత్వం ప్రకటించినా అందుకు తగ్గట్టుగా చర్యలు కానరావడంలేదు. ఎవరు అధికారంలో ఉన్నా ఇసుక తీరు మారడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు మాయమైపోయాయి. గోదావరి వరదలతో ఇసుక రీచ్‌లు ఆగిపోవడంతో కొద్ది రోజులుగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. వరదలు తగ్గినా ఇసుకతీతకు అనుమతులివ్వలేదు. ప్రస్తుతం కోనసీమ జిల్లా రావులపాలెం, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం పెండ్యాల రెండు ర్యాంప్‌ల నుంచి మాత్రమే ఇసుక సరఫరా జరుగుతోంది. మిగిలిన ర్యాంప్‌లు అన్ని మూతపడ్డాయి.దీంతో ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత ఏర్పడింది.

భవన నిర్మాణదారుల గగ్గోలు

శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉండడంతో అనేక మంది ఇళ్ళ నిర్మాణాలు తలపెట్టారు. వారంతా ఇసుక ధరలకు నోరెళ్లబెడుతున్నారు.ఇదేంటి ఉచిత ఇసుక అన్నారు కదా అని ఆశ్చర్యపోతున్నారు. వాస్తవానికి టన్ను ఇసుక రూ.420 ఉండేది.. అయితే ప్రస్తుతం ఏర్పడిన కృత్రిమ కొరతతో వినియోగదారుడికి చేర టన్ను వెయ్యి రూపాయలు పైబడే అవుతుంది. దీంతో ఇళ్ల నిర్మాణాలను చాలా మంది నిలుపుదల చేసుకున్నారు. నిర్దీత సమయానికి ఇళ్లు కట్టిస్తామని కాంట్రాక్టు పద్ధతిలో ఒప్పుకున్న బిల్డర్లు తలలుపట్టుకుంటున్నారు. ఇసుక ధరకే అంతపెడితే ఇక దీనిపై వచ్చే మార్జిన్ కూడా పెద్దగా ఉండదనే ఆందోళనలో ఉన్నారు. కొంత మంది నిర్మాణాలు నిలుపుదల చేసుకుని ఇసుక అందుబాటులోకి వచ్చాక పనులు మొదలు పెడదామని ఆగిపోయారు. ఇటువంటి వారంతా ఇసుక ధరలు అందుబాటులోకి వచ్చే రోజు కోసం ఎదురుచూస్తున్నారు. నిర్మాణాలు ఆగిపోవడంతో దానిపై ఆధారపడి జీవనం సాగించే మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు,ఎలక్ట్రీషియన్లు, రాడ్‌బెండర్లు,వెల్డర్లు, పెయింటర్లు ,వడ్రంగి పనివార్లు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఐదు యూనిట్ల ఇసుక రూ23వేలు పైమాటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేవలం 2 ర్యాంప్‌లు మాత్రమే పనిచేయడంతో ఇసుకకు విపరీతమైన డిమాం డ్ ఏర్పడింది. ఫలితంగా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలకు ఐదు యూనిట్ల ఇసుక వినియోగదారుడికి చేర్చడానికి రూ.23వేలు పైబడి ధరలు పలుకుంది. 10 టన్నుల ఇసుక రూ.14 వేలు పలుకుతుంది.సాధారణంగా ఐదు యూనిట్ల లారీ ఇసుక ధర రూ.8400, పది టన్నుల ఇసుక ధర రూ.4200 ఉండేది.. కానీ ప్రస్తుతం ధరలు చూస్తే గుండె గుబేల్‌మంటుంది. కోరుకొండ, గోకవరం, జగ్గంపేట వంటి ప్రాంతాలకు ట్రాన్స్‌పోర్టు అదనంగా చేర్చి ఐదు యూనిట్ల లారీ రూ.26 వేలకు అమ్ముతున్నారు. రావులపాలెం, పెండ్యాల ర్యాంపుల్లో రూ.8400 అదనపు చార్జీలు కలిపి మొత్తం రూ.11 వేలకు వచ్చే ఇసుకకు ట్రాన్స్‌పోర్టు చార్జీ అధికమవుతుంది. ఫలితంగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొవ్వూరు, తాళ్లపూడి, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ పరిధిలోని గాయత్రి, కోటిలింగాలు, కాతేరు, వేమగిరి ఇసుక ర్యాంప్‌లు ఉన్నాయి. వరదల కారణంగా ర్యాంపులన్నీ మూతపడి ఉండడంతో దూర ప్రాంతాల నుంచి ఇసుకను తీసుకువస్తున్నారు. దీంతో ధరలు పెరిగిపోయాయి. మరికొంత మంది అక్రమార్కులైతే గత ప్రభుత్వ హయాంలో నిల్వచేసిన ఇసుక డంప్‌లను ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే మూడు రోజుల్లో లిఫ్ట్ చేసేశారు. కొంత మంది ఈ డంప్‌లను ప్రైవేట్ స్థలాల్లో స్టాక్ పెట్టుకుని ఇప్పుడు బ్లాక్‌లో ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు.



ఇసుక బ్లాక్ మార్కెట్ ఎక్కువైంది..



కూటమి ప్రభుత్వం ఇచ్చిన వెంటనే ఇసుక ఉచితం అన్నారు.. చాలా ఆనందపడ్డాం. అయితే ప్రస్తుతం గత ప్రభుత్వంలో కంటే ఇసుక ధరలు అధికంగా ఉన్నాయి. సీఎం చంద్రబాబు ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తేనే భవన నిర్మాణ రంగం పటిష్టమవుతుంది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ఇసుక బ్లాక్ మార్కెట్ ఎక్కువైంది. నిజంగా రేవుల్లోకి వెళ్లి ఇసుక కొనుగోలు చేసేపరిస్థితి లేదు. ఇసుక బుక్ చేసుకుంటే రెండు రోజులు పడుతుంది. అదే బ్లాక్‌లో అయితే గంటల వ్యవధిలో ఇసుక ఇంటికి చేరుతుంది. .ఇసుక రీచ్‌లు అన్ని పనిచేసేలా చర్యలు తీసుకుని ఇసుకను అందుబాటులోకి తీసువస్తే నిర్మాణాలు పెరుగుతాయి. **- బోడా వెంకట్, బిల్డర్,రాజమహేంద్రవరం**

ఇసుకను అందుబాటులోకి తేవాలి..



లక్షలాది మంది భవన నిర్మాణరంగంపై ఆధారపడి జీవిస్తున్నాం. ఇసుక అందుబాటులోకి తీసుకురండి.. గతంలో ఇసుక ధరలు విపరీతంగా పెరిగి ఇబ్బందులు ఎదురయ్యాయి. నిర్మాణాలు ఆగిపోయాయి. భవనిర్మాణ రంగంపై ఆధారపడి జీవించే అన్ని వర్గాల పరిస్థితి దారుణంగా మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఖచ్చితంగా మార్పులు వస్తాయని ఆశించాం. కానీ ఇంత వరకు ఇసుకను అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. చిన్న లారీ ఇసుక (పదిటన్నులు) రూ.13 నుంచి రూ.14 వేలా ఇదెక్కడి అన్యాయమండి. ఇప్పుడు ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఇసుకను వెంటనే అందుబాటులోకి తేవాలి.

- తరుగొప్పులు వెంకన్నబాబు, తాపీమేస్త్రి, రాజమహేంద్రవరం

తగ్గింపు ధరలకే కందిపప్పు, బియ్యం : జేసీ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19 : జిల్లాలో రైతు బజార్లు, స్పెషల్ కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యాన్ని తగ్గింపు ధరలకు విక్రయాలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జేసీ ఎస్.చినరాముడు అన్నారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం సాయంత్రం పౌరసరఫరాలు, ఇతర సమన్వయ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉల్లిపాయల ధర పెరుగుతున్నందున నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 113 ప్రత్యేక కౌంటర్లు ప్రారంభించి అమ్మకాలు చేస్తున్నామన్నారు. కందిపప్పు బహిరంగ మార్కెట్లో రూ.165 ఉంటే రూ.150లకు, బియ్యం (స్టీమ్) బహిరంగ మార్కెట్లో రూ.55 ఉంటే రూ.48లకు విక్రయిస్తున్నామన్నారు. జిల్లా పౌరసఫరాల అధికారి పి.విజయబాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

46 కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న గంజాయిని సెబ్ సౌత్ స్టేషన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. తమ సిబ్బందితో దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మూడు ద్విచక్ర వాహనాల్లో ఒడిశాలోని కలిమెల మండలం నాగులూరు గ్రామం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం గ్రామానికి గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. మూడు వాహనాల్లో 46.81 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నాగులూరుకు చెందిన శంకం రాజుబాబు, పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలానికి చెందిన గళ్ల ఐజాక్ రాజు, కలిమెల మండలం పెట్బాల్ గ్రామానికి చెందిన వేలుసేరి బుజ్జి, వేలుసేరి వెంకీలను అదుపులోకి తీసుకున్నామని హనుశ్రీ పేర్కొన్నారు. తనిఖీల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ, ఎస్ఐ వై.దుర్గాప్రసాద్, శ్రీనివాసులు, డీటీఎఫ్ ఎస్ఐ ఆర్.క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారన్నారు.



జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం

జాంపేట బ్యాంక్ ఛైర్మన్‌గా జయకుమార్

రాజమహేంద్రవరం,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గం ఛైర్మన్‌గా బొమ్మన జయకుమార్, వైస్ ఛైర్మన్‌గా ఆర్.విజయశేఖర్ ఎన్నికయ్యారు. జాంపేట బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌తో పాటు మరో 10 డైరెక్టర్ల చేత రాజమహేంద్రవరం డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్,ఎన్నికల అధికారి ఎం. జగన్నాథరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం తొలి సమావేశం జరిగింది. కొత్తగా పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, విజయవాడలలో బ్రాంచిలు పెట్టడానికి రిజర్వు బ్యాంక్ అనుమతిచ్చిందని తెలిపారు. ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ ఫెడరేషన్ ఛైర్మన్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకార రంగం మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు ప్రసాదుల హరనాథ్,ఎం.లక్ష్మణరావు,జామిశెట్టిగాంధీ, ద్వారా పార్వతీ సుందరి, కనకం నాగేశ్వరరావు, బీరా శ్రీనివాసరావు, బూరా రామచంద్రరావు యాండ్రపు రామకృష్ణ, జామికృష్ణ అధికారులు పాల్గొన్నారు.

చవితికి అనుమతి తీసుకోవాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 7న వినాయక చవితి కాలుష్య సమస్యలు లేకుండా నిర్వహించాలని, పందిళ్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ నుంచి డివిజన్,మండల స్థాయి అధికారులతో జేసీ ఎస్.చినరాముడు, డీఆర్వో జి.నర సింహులుతో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.మట్టి విగ్రహాలతో మాత్రమే చవితి వేడుకలు చేసుకోవాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని చెప్పారు.

రాఖీ పండుగ ఆనందం..ఆవిరి! 7

జగనన్న కాలనీలో జంట ఆత్మహత్య

ధవళేశ్వరంలో అవినీటి పారుదల?

హాస్టళ్లలో.. కుక్కుడే!



ఎస్సీ హాస్టళ్లలో పరిమితికి మించి విద్యార్థులు

- అటకెక్కుతున్న సంక్షేమం
- 2085 మందికి వసతి
- సౌకర్యాలు శూన్యం
- విద్యార్థినీ..విద్యార్థుల ఇక్కట్లు
- నిబంధనలు గాలికొదిలేసిన వైనం
- పట్టించుకోని అధికారగణం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19 : సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో అక్రమ అడ్మిషన్లు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. చాలా హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేకపోయినా, పై అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండానే నిబంధనలు బేఖాతరు చేస్తూ హాస్టళ్లలో విద్యార్థులను కుక్కుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు వార్డెన్లు ఉండాల్సిన వారి కంటే ఎక్కువగా విద్యార్థులను జాయిన్ చేసుకోవడంతో అనేక హాస్టళ్లలో పిల్లల సంఖ్య భారీగా పెరిగిపోయింది. దీంతో ఇరుకైన వసతి, సౌకర్యాల లేమితో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జిల్లా వ్యాప్తంగా 35 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ఒక్క దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం ఐడబ్ల్యూహెచ్‌సీ బాలికల హాస్టల్‌కు మాత్రమే 200 శాంక్షన్ స్ట్రెంగ్త్ ఉంది. మిగిలిన 34 హాస్టళ్లలో ఒక్కో హాస్టల్‌కు శాంక్షన్ స్ట్రెంగ్త్ 100 మంది విద్యార్థులు.. అయితే అనేక హాస్టళ్లలో ఈ నిబంధన పాటించడంలేదు.శాంక్షన్ కంటే మించితే ఏఎస్‌డబ్ల్యువో, డీఎస్‌డబ్ల్యువో, జిల్లా కలెక్టర్ అనుమతి పొందాలి. ఈ నిబంధనలన్నీ పక్కనపెట్టేసి ఉన్నతాధికారుల అనుమతుల్లేకుండానే కొందరు వార్డెన్లు (హెచ్‌డబ్ల్యువో)లు స్వలాభంతో ఇష్టారాజ్యంగా విద్యార్థినీ విద్యార్థులను చేర్పించుకుంటూ వారిని ఇబ్బందుల పాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులకు ఇవన్నీ తెలిసినా ఎలాంటి అభ్యంతరం చెప్పకపోగా కనీసం నోరు మెదపకపోవడంలో ఆంతర్యం ఏమిటనేదానిపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలోని అన్ని హాస్టళ్లలోనూ 2,085 మంది విద్యార్థులున్నారు. వీరిలో రెన్యువల్ అయిన విద్యార్థులు 1296 మంది కాగా ఈ ఏడాది కొత్తగా 761 మంది విద్యార్థినీ విద్యార్థులు హాస్టళ్లలో చేరడం గమనార్హం.

పరిమితికి మించి..

శాంక్షన్ స్ట్రెంగ్త్‌కు మించి విద్యార్థినీ విద్యార్థులను జాయిన్ చేసుకుంటే ఆయా హాస్టళ్లలోని పిల్లలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వసతి, వాష్‌రూంలు, ఇతర అన్ని సౌకర్యాల విషయంలోనూ రాజీ పడాలి. ఎందుకంటే శాంక్షన్ మేరకే ప్రతి విద్యార్థికీ బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి. మెస్‌ఛార్జీలు, కాస్మొటిక్ తదితర ఛార్జీలన్నీ నిబంధనల మేరకే ప్రభుత్వం విడుదల చేస్తుంది. పిల్లల సంఖ్యకు అనుగుణంగానే సౌకర్యాలు ఉంటాయి. అయితే కొందరు హాస్టల్ వార్డెన్లు ముందుచూపుతో హాస్టళ్లలో అదనపు ప్రవేశాలకు ద్వారాలు తెరుస్తున్నారు. కొందరైతే అతి తెలివితో మాట్లాడుతున్నారు. ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేస్తున్నారని, దీంతో జాయిన్ చేసుకోక తప్పడంలేదని కొందరు, దళిత సంఘాల నేతల ఒత్తిడి ఉంది అని మరికొందరు చెబుతున్నారు. ఇలా ఏదో ఒక వంకపెట్టి పెద్ద సంఖ్యలో విద్యార్థులను చేర్పించుకుని ఆ తర్వాత అనుమతులు కోరవచ్చనే ఆలోచన చేస్తున్నారు. పిల్లలు చేరిన తర్వాత ఎలాగూ అనుమతులు వస్తాయనే ధీమా చూపుతున్నారు. అయితే సరిగ్గా ఇక్కడే ఒక మెలిక ఉంది. పిల్లలు తక్కువగా ఉంటే బడ్జెట్ తక్కువ వస్తుంది. అదే పిల్లలు ఎక్కువగా ఉంటే బడ్జెట్ భారీగా పెరుగుతుంది. దీంతో హాస్టళ్ల మెయింటెనెన్స్ ఈజీ అవుతుందని,ఎంతో కొంత నొక్కేయవచ్చనే ఆలోచన కొంతమంది వార్డెన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.హాస్టల్ పిల్లలు సదుపాయాలన్నింటిలోనూ సర్దుకుపోవాల్సిన దుస్థితి ఉంటుందని దళిత, ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు.

సౌకర్యాలు శూన్యం..

రాజమహేంద్రవరం గణేష్‌చౌక్‌లోని నెంబర్ - 1 గరల్స్ హాస్టల్‌లో దాదాపుగా 173 మంది విద్యార్థినులకు ప్రవేశం కల్పించారు. ఆఫ్‌లైన్‌లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందనే అనుమానాలున్నాయి.ఇక్కడ శాంక్షన్ స్ట్రెంగ్త్ 100 మంది మాత్రమే అదనంగా మరో 73 మందిని జాయిన్ చేసుకున్నారు. ఎప్పుడో నిర్మించిన పాత భవనంలోనే బాలికల హాస్టల్ నడుపుతున్నారు. సౌకర్యాలు అంతంతమాత్రమే బాత్రూంలు, వసతి విషయంలో హాస్టల్ విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇక్కడ 100 మందికే పూర్తిస్థాయి సౌకర్యాలు లేని పరిస్థితి.. అదనంగా మరో 73 మందికి ప్రవేశం కల్పించడం ఆశ్చర్యం కల్గిస్తుంది. బాలుర హాస్టల్ నెం.1లో 153 మందికి ప్రవేశం కల్పించారు. కాలేజీ బాలుర హాస్టల్ నెం.1లో 112 మంది, కాలేజీ గరల్స్ హాస్టల్ నెం.2లో 130 మంది, దేవరపల్లి చిన్నాయిగూడెం గరల్స్‌హాస్టల్‌లో 240 మందిని జాయిన్ చేసుకున్నారు. ఇలా అనేక హాస్టళ్లలో సౌకర్యాలు లేకపోయినా ఎక్కువగా అడ్మిషన్లు కల్పిస్తూ విద్యార్థులకు నరకం చూపుతున్నారనే విమర్శలున్నాయి. హాస్టల్స్‌కు డిమాండ్ ఉన్నా వసతి, ఇతర కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినీ విద్యార్థులకు నరకప్రాయంగా మారుతోందని చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఈ అక్రమ అడ్మిషన్లపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించకపోతే సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థినీ, విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

పరిమితికి మించి జాయినింగ్స్ నిజమే

హాస్టళ్లకు మంజూరు చేసిన శాంక్షన్ స్ట్రెంగ్త్ కంటే ఎక్కువ మంది పిల్లలను జాయిన్ చేసుకోవడం వల్ల కొంత ఇబ్బంది ఉన్నమాట నిజమే. జిల్లాలో నాలుగైదు హాస్టళ్లలోనే ఇలా ఎక్కువ మంది విద్యార్థులను జాయిన్ చేసుకున్నారు. జిల్లా అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదు. హాస్టళ్ల వార్డెన్ల నుంచి దీనిపై పూర్తి సమగ్ర సమాచారం కోరతా. **- సందీప్, డీఎస్‌డబ్ల్యువో**

ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

- అధికారులకు కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక
- కలెక్టరేట్‌లో 143 అర్జీల స్వీకరణ
- పలు సమస్యలపై ఫిర్యాదులు



సమస్యలేమిటమ్మా: కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 19 : జిల్లాస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక) ద్వారా 143 అర్జీలను స్వీకరించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలో ఆర్ఎస్‌నెంబరు 472/1, 474/2, 3లలో రాజమహేంద్రవరానికి చెందిన పల్లంటి శ్రీధర్‌కు చెందిన భూమి అన్యాక్రాంతమైందని బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ స్పందించి విచారణ చేపడతామన్నారు. సీతానగరం మండలం చినకొండేపూడికి చెందిన కే.శ్రీనివాస్, రాంబాబు పురుషోత్తపట్నం ఇరిగేషన్ కాలువకు సంబంధించి 106 మందికి పరిహారం చెల్లించలేదని అర్జీపెట్టుకున్నారు. జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు ప్రైవేట్ విద్యాసంస్థలు తూట్లు పొడుస్తున్నాయని ఫిర్యాదు చేశారు. హెల్త్ విభాగంలో సెకండ్ ఏఎన్ఎంలు గా పనిచేసిన తమను సచివాలయాలకు తీసుకున్నారని ఇప్పుడు తిరిగి మాతృసంస్థకు పంపాలని ఎఎన్ఎంలు కోరారు. పౌరసరఫరాల శాఖకు 36, పోలీస్ శాఖకు 25, పంచాయితీరాజ్‌కు 16, పురపాలక శాఖకు 10, ఇతర శాఖలకు 21 అర్జీలు వచ్చాయని జేసీ చిన రాముడు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు , దిశ స్టేషన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణనాయక్, టూరిజం ఆర్‌డీ వి. స్వామి నాయుడు, పౌరసరఫరాల డీఎం టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గారి ఇలాఖాలో..నిర్లక్ష్యమా!

నిడదవోలు, ఆగస్టు 19 : ఒక మంత్రి నియోజకవర్గంలో ఉన్నామన్న భయం అధికారుల్లో కానరా వడంలేదు.. గత ప్రభుత్వంలో ఎలాగైతే ప్రవర్తిం చారో నేటికీ అలాగే ఉంది అధికారుల తీరు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుంది.ఈ కార్యక్రమానికి స్థానిక అధికారులు హాజరై హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.అయితే మంత్రి కందుల దుర్గేష్ నియోజకవర్గ కేంద్రం నిడదవోలు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 మంది మండలస్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే హాజర య్యారు. క్షేత్రస్థాయి పర్యటనలు ఏమైనా ఉన్నా యా అంటే అదీ లేదు. గత వారమూ ఇంతే. ఎందుకో మరి ప్రభుత్వ కార్యక్రమంపై నిర్లక్ష్యం చూపుతున్నారు. గత సోమవారం నిడదవోలులో జరిగిన కార్యక్రమానికి 13 మంది మాత్రమే హాజరుకాగా ఈ వారం 12 మంది మాత్రమే హాజరవడం విశేషం.అయితే ఆయా శాఖల అధికారులను కలిసేందుకు వచ్చిన జనం మాత్రం సమస్యలు ఎవరికీ చెప్పాలోతెలియక నిరాశగా వెనుతిరుగుతున్నారు.



నిడదవోలులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులు



అవినీటి..పారుదల!?

- ఇరిగేషన్ శాఖలో గత ఐదేళ్లుగా ఇంతే
- అదనపు బాధ్యతలతో దోపిడీ
- అందరూ అదనపు చార్జ్‌లే
- వీరిలో డెల్టా సీఈ నుంచి ఎస్ఈ, డివిజన్ ఈఈలు
- ఎవరికి వారే అన్నచందంగా డివిజన్ల తీరు
- పదవీ విరమణ చేయించాల్సిన ఎన్ఎంఆర్ ఉద్యోగికి 8 నెలలుగా జీతం
- పట్టించుకోని హెడ్‌వర్క్స్ ఈఈ, ఎస్ఈకి ఫిర్యాదు అందడంతో వెలుగులోకి

ధవళేశ్వరం, ఆగస్టు19: కలెక్టరమ్మా కాస్త ఇటు చూడమ్మా.. ధవళేశ్వరం నీటి పారుదలశాఖపై దృష్టి పెట్టమ్మా.. అక్కడ జరిగే దారుణాలు అన్నీ ఇన్నీ కావు.. బ్రిటీష్ వాళ్లు నిర్మించిన భవనాలమాటున ఎన్నో అకృత్యాలు సాగుతున్నాయి. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్నా నేటికీ మార్పు లేదు.. అధికారులకు నచ్చినచోట.. ఇష్టం వచ్చినట్టు దోచుకుంటూ అవినీటి పారుదల శాఖగా మార్చేశారు. దీనిలో భాగంగా సొమ్ములు వచ్చే సీట్లను ఎంచుకుని ధవళేశ్వరం నీటి పారుదలశాఖలో అడిషనల్ చార్జిలుగా కొన సాగుతున్నారు. ఒక్కసారి లెక్క తీస్తే గత ప్రభుత్వ హయాంలో మంత్రులను, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని అదనపు ఆదాయానికి అదనపు సీటులో కూర్చున్న వారే అధికం. డెల్టా సీఈ నుంచి ఎస్ఈ, డివిజన్ ఈఈలు అందరూ అదనపు చార్జ్‌లతో కొనసాగుతున్నవారే. తూర్పు డెల్టా, మధ్యడెల్టా వైడ్ డివిజన్లతోపాటు సర్కిల్ కార్యాలయంలోని డిప్యూటీ ఎస్ఈ, ఆఫీసర్ అండ్ టెక్నికల్ (ఓటీ)వంటి పోస్టుల్లో ఉన్న ఉద్యోగులందరూ అదనపు బాధ్యతలు చేపట్టినవారే. అదనపు బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించాల్సిన అధికారులు ఆయా డివిజన్లను పూర్తిస్థాయిలో పట్టించుకోకుండా కాసులు వచ్చే పనులపైనే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆయా శాఖల ఉద్యోగులు కూడా సమయపాలన పాటించకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజం చేస్తున్న సంఘటనలు బయటపడుతున్నాయి. దానికి ఈ కింద సంఘటనే ఉదాహరణ.

పదవీ విరమణ చేయాల్సిన ఉద్యోగికి 8 నెలలుగా జీతం

2010వ సంవత్సరంలో కొందరు ఎన్ఎంఆర్ ఉద్యోగులుగా కోర్టు ఆర్డరుతో హెడ్ వర్క్స్ డివిజన్‌లో విధుల్లో చేరారు. ఆ సమయంలో తమ వయసును నిర్ధారించే పత్రాలు అందజేశారు. వారిలో కొందరి వయసు నిండడంతో 2023 మే, జూన్‌లలో ఉద్యోగ విరమణ చేశారు. అప్పట్లోనే ఉద్యోగ విరమణ చేయాల్సిన వ్యక్తి హెడ్ వర్క్స్ సెక్షన్‌లో కాటన్ మ్యూజియంలో విధులు నిర్వహిస్తూ గత 8 నెలలుగా ఎటువంటి ఆటంకం లేకుండా జీతం పొందుతున్నాడు. హెడ్‌వర్క్స్ ఈఈ నిర్లక్ష్య వైఖరితోపాటు సంబంధిత సెక్షన్ ఉద్యోగులు పట్టించుకోకపోవడంతోనే ఉద్యోగ విరమణ చేయించాల్సిన వ్యక్తికి 8 నెలలుగా జీతం చెల్లిస్తున్నారని ఉద్యోగ వర్గాల్లోనే విమర్శలు వినిపిస్తున్నాయి

ఎస్ఈకి ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి

సదరు ఎన్ఎంఆర్ ఉద్యోగి విషయంలో ఉద్యోగ విరమణ చేయించకుండా సొమ్ములు తీసుకుని రికార్డుల్లో వయసు మార్చి ఉద్యోగంలో కొనసాగిస్తూ 8 నెలలుగా జీతం చెల్లిస్తున్నారని సర్కిల్ ఎస్ఈకి ఫిర్యాదు అందడంతో హెడ్‌వర్క్స్ ఈఈని వివరణ కోరారు. రికార్డులు పరిశీలించి 2023 మేలోనే సదరు ఉద్యోగిని విరమణ చేయించాల్సి ఉందని గుర్తించారు. నిబంధనల మేరకు ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేయించినా ఉద్యోగ విరమణ తరువాత అతడికి ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాట్యుటీ, పింఛన్ వంటివి ఉండకపోవడంతో గత 8 నెలలుగా ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించిన జీతం ఏ విధంగా రాబట్టాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. వీరి నిర్లక్ష్యానికి చెల్లించిన జీతం హెడ్‌వర్క్స్ డివిజన్‌లోని సంబంధిత ఉద్యోగుల నుంచి రాబట్టాలా, లేక డివిజన్ ఈఈ భరిస్తారా లేకుంటే మసిపూసి మారేడుకాయ చేస్తారనేది సర్కిల్ ఎస్ఈకే తెలియాలి.




శ్రీపాదశ్రీవల్లభుడికి, ఔదంబర వృక్షానికి రాఖీ కడుతున్న భక్తులు

దత్తక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

- పిఠాపురంలో ఆలయాలకు శ్రావణి(రాఖీ)పౌర్ణమి శోభ
- శ్రీపాదుడు, ఔదంబర వృక్షానికి రాఖీదారణ



ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు

పిఠాపురం, ఆగస్టు 19: దత్తక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ఆలయాలు, రహదారులు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపాదుడు, ఔదంబర వృక్షాలకు భక్తులు రాఖీలు కట్టారు. పిఠాపురంలోని దత్తక్షేత్రాలకు సోమవారం శ్రావణ పౌర్ణమి శోభ చేకూరింది. శ్రావణ(రాఖీ లేదా జంధ్యాల) పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీపాదవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్‌తోపాటు ఉభయ తెలుగురాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలన్నీ భక్తజనసంద్రమయ్యాయి. శ్రీపాదశ్రీవల్లభస్వామికి మహిళలచే రాఖీదారణ జరిగింది. దత్త స్వరూపంగా భావించే ఔదంబర వృక్షానికి రాఖీలు కట్టారు. వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీపాదశ్రీవల్లభులకు రాఖీ కట్టిన పవిత్రదినం కావడంతో మహిళా భక్తులు రాఖీ కట్టేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. స్వామికి మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, హోమం, అభిషేకాలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాఖీ ఆనందం క్షణాల్లో ఆవిరి!?

- అమ్మను కబళించిన మృత్యువు



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు





ప్రమాదంలో మృతిచెందిన సత్యవేణి



లారీ డ్రైవర్‌ను కట్టేసిన దృశ్యం

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ ఆ కుటుంబంలో అంతులేని శోకాన్ని మిగిల్చింది. కూతురిని తీసుకొని కొడుకు వద్దకు వెళ్లి రాఖీ కట్టించిన ఆనందం క్షణాల్లో ఆవిరైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కొత్తపేటలోని సంతోష్‌నగర్‌కి చెందిన కనకాల అమ్మిరాజు, సత్యవేణి దంపతులకు ఇద్దరు పిల్లలు. కొడుకు శ్రీరామ్ రాజమహేంద్రవరం శివారు కాతేరులోని తిరుమల కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. సోమవారం రాఖీ పౌర్ణమి కావడంతో కూతురు వైష్ణవి, అన్నయ్య గుర్రాల దుర్గారావుతో కలిసి తిరుమల కళాశాలకు వెళ్లారు. తమ్ముడు శ్రీరామ్‌కి వైష్ణవి రాఖీ కట్టింది. అందరూ కలిసి భోజనం చేసి కాసేపు ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం 3.30సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. కళాశాలకు కొద్ది దూరంలో వంతెనపై వెళ్తుండగా ఒడిశా నుంచి పేపర్ మిల్లుకు కర్రల లోడుతో వస్తున్న వ్యాను వీరి బైక్‌ని బలంగా ఢీకొంది. వ్యాన్ డ్రైవరు చబుద్రప్రధాన్ తాగిన మైకంలో దారి తప్పడంతో పేపర్‌మిల్లు దాటిపోయి సుమారు 3 కిలోమీటర్లకుపైగా వెళ్లిపోయాడు. అదే సమయంలో రాజ మహేంద్రవరం వైపు ఆ ముగ్గురూ బైక్‌పై వస్తున్నారు. వంతెన పైకి రాగానే కుడివైపు వెళ్తున్న వ్యాన్‌ని మద్యం మత్తులో ఎడమ వైపునకు అకస్మాత్తుగా తిప్పడంతో బైక్‌ని బలంగా ఢీకొంది. దీంతో బైక్ వెనుక చివరన కూర్చున్న సత్యవేణి వెనక్కి పడిపోవడంతో తలకు వంతెన సిమెంటు ప్లాట్‌ఫాం బలంగా తగిలి తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. వైష్ణవి, దుర్గారావుకు తీవ్రంగా గాయాలయ్యాయి. వారిని తొలుత ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటన జరిగిన తర్వాత స్థానికులు పరుగుపరుగున అక్కడికి చేరుకున్నారు. వారిలో ఒకరు 108కి ఫోన్ చేశారు. అయితే ధవళేశ్వరం నుంచి వచ్చే వాహనం లేదని.. రాజానగరం నుంచి పంపిస్తామని చెప్పారు. ఫోన్‌లు చేసినా ఫలితం లేదు. ఈలోపు ఆటోలో ఆస్పత్రికి తరలించడానికి సన్నద్ధమవుతుండగా.. అరగంట దాటిన తర్వాత 108 వచ్చింది. అప్పటికే వైష్ణవి తలకు బలమైన గాయం కావడంతో రక్తమోడుతూ దాదాపుగా స్పృహ కోల్పోయింది. దీంతో స్థానికులు 108పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వాహనం ఆలస్యం వల్లనే వైష్ణవి పరిస్థితి విషమంగా మారిందని ఆవేదన చెందారు. వ్యాన్ డ్రైవర్ చబుద్రప్రధాన్ నిర్లక్ష్యమని ప్రాథమికంగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని సీఐ అప్పారావు తెలిపారు.

‘ఆదిత్య’లో వృక్షాబంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న దృశ్యం

గండేపల్లి, ఆగస్టు 19: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో హరిత ఎకో క్లబ్ వారు వృక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ఒక వృక్షాన్ని దత్తత తీసుకుని ఆ వృక్షాన్ని కాపాడడం, కొత్తగా మొక్కలు నాటడం వంటివి చేయడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. అనంతరం కాలేజీ ఆవరణలో, వెంకటాపురం గ్రామంలో జడ్పీ హైస్కూల్ నందు పిల్లలతో చెట్టుకు రక్షాబంధం కట్టించారు.

రాఖీ కట్టిన అక్కకు తమ్ముడు డైమండ్ చెవి దిద్దులు కానుక



పేరవరంలో అక్కకు డైమాండ్ రింగ్‌ను బహూకరిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 19: ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన దాసరి సూర్యతేజ రాఖీ పౌర్ణమి సందర్భంగా తన అక్క కావ్యకు ఖరీదైన బహుమతి ఇచ్చాడు. ఇంజనీరింగ్ పూర్తిచేసి ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న సూర్యతేజ సోమవారం హైదరాబాద్‌లో ఉంటున్న తన అక్క కావ్య దగ్గరకు వెళ్లి రాఖీ కట్టించుకుని అనంతరం సుమారు రూ.లక్షా 30 వేలు విలువచేసే డైమండ్ చెవి దిద్దులను కానుకగా ఇచ్చాడు. తమ్ముడు బహుమతినిచూసి అక్క ఆనందానికి అవదులులేవు. తమ్ముడికి కావ్య రూ.14వేల వాచీని బహుమతిగా ఇచ్చారు.

జగ్గంపేట జగనన్న కాలనీలో ఇద్దరు అనుమానాస్పద మృతి

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



జగ్గంపేటలో ఒకే గదిలో ఇద్దరు ఉరేసుకుని మృతి చెందిన దృశ్యం

జగ్గంపేట, ఆగస్టు 19: కాకినాడ జిల్లా జగ్గంపేట జగనన్న కాలనీలో సోమవారం సాయంత్రం ఇద్దరు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన జరిగింది. జగ్గంపేట పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ రఘునాధరావు, ఏఎస్ఐ నూకరాజు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం... గత మూడేళ్లుగా జగనన్నకాలనీలో ఒక ఇల్లు అద్దెకి తీసుకుని రంగంపేటకు చెందిన వివాహిత అన్నాబత్తుల ప్రసన్న అద్దెకు ఉంటుంది. అదే విధంగా జగ్గంపేటకు చెందిన యువకుడు నాని (25) ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇద్దరి మధ్య కలహాలు రావడంతో సోమవారం సాయంత్రం ఆమె ఉరేసుకోగా అది చూసి తట్టుకోలేక అతను కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు స్థానికులు తెలియజేశారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ నివాసం వద్ద జనవాణి

- జిల్లాలు నుంచి తరలివచ్చిన ప్రజలు



జనవాణి కార్యక్రమంలో వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 19: కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద సోమవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. జనవాణిలో తమ సమస్యలు విన్నవించుకునేందుకు పిఠాపురం నియోజకవర్గంతో పాటు వివిధ జిల్లాలు నుంచి ప్రజలు తరలివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది వారి సమస్యలు తెలుసుకుని వినతులు స్వీకరించారు. వీటిని పరిష్కారం నిమిత్తం డిప్యూటీ సీఎం కార్యాలయం ద్వారా ఆయా శాఖల అధికారులకు పంపనున్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలతో పాటు అర్హతఉన్నా పించన్లు అందకపోవడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోసం, వైద్య సహాయంఅంశాల్లో ఎక్కువగా వినతులు వచ్చాయి. తన ఇంటిని నాలుగు సంవత్సరాల క్రితం అద్దెకు ఇచ్చానని, వారు అద్దె ఇవ్వకపోగా తనను ఇంటి నుంచి గెంటి వేశారని మచిలీపట్టణంలోని నిజాంపేట ప్రాంతానికి చెందిన మహిళ కేదారేశ్వరీ జనవాణిలో ఫిర్యాదు చేసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం, పోలీసుల అండ చూసుకుని ఇంటి నుంచి గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం చేయకపోగా, తనకు మానసికస్థితి సరిగాలేదంటూ ముద్రవేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని విన్నవించారు. పవన్‌కల్యాణ్‌కు సమస్య విన్నవించుకుంటే సమస్య పరిష్కారమవుతుందని చెప్పారని,అందుకే ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

నేడు జేఎన్టీయూకే 16వ ఆవిర్భావ దినోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు
- కృష్ణతేజ, రామకృష్ణలకు యంగ్ అఛీవర్స్ అవార్డుల ప్రదానం

జేఎన్టీయూకే, ఆగస్టు19: కాకినాడ జేఎన్టీయూకే 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్జీ మురళీకృష్ణ తెలిపారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం వర్సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌ఛార్జి చైర్మన్ కె.రామ్మోహన్‌రావు, గౌరవఅతిథిగా కాకినాడ సీపోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మెర్ల మురళీధర్ పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అవార్డులను అందజేస్తామని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్, డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఎంవీఆర్ కృష్ణతేజ, ప్రొవిజన్స్ లాజిస్టిక్స్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణలకు యంగ్ అఛీవర్స్ అవార్డులను ప్రదానం చేయనున్నామన్నారు. ఈ వేడుకలకు మాజీ ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు, పూర్వవిద్యార్థులను ఆహ్వానించామని తెలిపారు. సమావేశంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అమెరికా హానర్‌కు ఫొటోగ్రాఫర్ అభిరామ్ ఎంపిక

రాజానగరం, ఆగస్టు 19: వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఇమేజ్ కొలీగ్ సొసైటీ అమెరికా(ఐసీఎస్) ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 28 మంది ఫొటో గ్రాఫర్లకు గౌరవ హానర్‌లు ప్రకటించి దని, దీనిలో మన దేశం నుంచి 11మందికి గానూ, తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిలో తెలంగాణ నుంచి నలుగురు, ఆంధ్రప్రదేశ్ నుంచి హానర్‌కు తనను ఎంపిక చేసినట్టు ఫొటో గ్రాఫర్ అభిరామ్ తెలిపారు. రాజానగరం మండలం కొత్తతుంగ పాడు గ్రామానికి చెందిన గొల్లపల్లి అభిరామ్ చదువుకునే రోజుల్లో ఫొటోగ్రఫీపై ఉన్న మక్కువతో తొలిసారిగా 1998లో ఫొటోగ్రఫీ వృత్తిలోకి ప్రవేశించాడు. అప్పటి నుంచి నేటి వరకు వివిధ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లలో పాల్గొని 42 ఫొటోగ్రఫీ అవార్డులు సాధించినట్టు చెప్పారు. హానర్ రావడానికి సహకరించిన పటాన్ హుస్సేన్‌ఖాన్, తుమ్మా శ్రీనివాస్‌రెడ్డి, సమీర్ మధుకర్ మోహితేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు డిసెంబర్ 1న విజయవాడ బాలోత్సావ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో హానర్ అందుకోనున్నట్టు అభిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు ఆయనకు అభినందనలు తెలియజేశారు.



అవార్డులు తెచ్చిపెట్టిన అభిరామ్ అపురూప చిత్రం

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

- కోలమూరులో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా ఘటన

రాజానగరం, ఆగస్టు 19: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంతమూరులోని ఎస్‌వీబీ లేఅవుట్‌లో విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి చెందినట్టు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ సోమవారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన కొక్కిరిపాటి రాజు(55) గౌరీపట్నం క్వారీ నుంచి గ్రావెల్ లోడు చేసుకుని రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు చేరుకున్నాడు. స్థానిక ఎస్‌వీబీ లేఅవుట్‌లో ఆదివారంరాత్రి 7.30 సమయంలో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా పైనున్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. మృతుడి అల్లుడు ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలేనికి చెందిన ఉండ్రాజవరపు పాపారావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తునిరూరల్, ఆగస్టు 19: 16వనెంబరు జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరులో జరిగింది. ఎర్రకోనేరు జంక్షన్‌లో ఓ హోటల్‌ఎదురుగా రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సుమారు 35ఏళ్ల వయస్సుగల వ్యక్తిని తుని నుంచి అన్నవరం వైపుగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి.స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించే సమయంలో వ్యకిప్రాణాలు వదిలాడు. మృతుడి వివరాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో ఉంచారు. మృతుడి బంధువులు రూరల్ పోలీసులను సంప్రదించాలన్నారు.

కారులో గంజాయి రవాణా

- 25 కిలోలు స్వాధీనం.. ఏడుగురి అరెస్టు
- చోరీ కేసుల్లోని రూ.11,81,000 విలువైన సొత్తు రికవరీ



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొవ్వూరు, ఆగస్టు 19: గంజాయి రవాణాచేస్తున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 25.130కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌ల్లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం ఎస్ఐ కె.జగన్మోహన్, లీగల్ మెట్రాలజి అధికారులు, రెవెన్యూ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో సర్వీస్‌రోడ్‌లో మారుతి కారు అనుమానాస్పదంగా వస్తుండడంతో ఆపి తనిఖీ చేశారు. కొవ్వూరు కోట్ల వారి వీధికి చెందిన రౌడీషీటర్ కంచుబాణి దినకర్, ఇందిరమ్మకాలనీకి చెందిన భూపతి అశోక్, భూపతి అశ్వర్థ, దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన కడింపల్లి సిద్ధార్థ, దేవరపల్లి మండలం యర్నగూడెం పాతపేటకు చెందిన గీసాల రవికుమార్, కొరివేటి పోసికుమార్, పోలవరం హైస్కూల్ రోడ్డుకు చెందిన చెట్టేబత్తుల హర్షవర్ధన్‌లు అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల గ్రామంలో కొనుగోలు చేసి కారులో రెండు బ్యాగ్‌లుగా పార్సిల్ చేసి తీసుకువస్తున్న 25.130 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.75 వేలు ఉంటుందన్నారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణ అనంతరం కొవ్వూరు, రాజానగరం, దేవరపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగిన ఐదు దొంగతనాలకు సంబంధించిన ఆస్తిని రికవరీ చేశామని సీఐ చెప్పారు. 2024 జూన్ నుంచి జూలై 17 వరకూ కొవ్వూరు, దొమ్మేరులోని జగనన్నకాలనీ, దేవరపల్లి మండలం కృష్ణంపాలెం, గౌరీపట్నం, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరులో జరిగిన చోరీ కేసుల్లోని రూ.11,81,000 విలువైన వస్తువులను రికవరీ చేసినట్టు చెప్పారు. గంజాయి రవాణాతో పాటు ఈ ఐదు కేసుల్లో ఏడుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ విశ్వం తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి పూజలు

అన్నవరం, ఆగస్టు 19: సత్యదేవుడి సన్నిధిలో సోమవారం కేంద్ర మాజీ మంత్రి, సింహాచలం దేవస్థానం చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలకగా వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం సత్యగిరి కొండపై నిర్మాణాలైన వేదపాఠశాల శివసదన్ కాటేజీ, ఉచితకల్యాణమండపాలను పరిశీలించారు. ఆయన వెంట సహాయకమిషనర్ విశ్వనాధరాజు, పీఆర్వో కృష్ణారావున, తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌గజపతిరాజుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

గంజాయి కేసులో విలేకరుల అరెస్టు ఓ కుట్ర

- ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రులు మోహన్, కవాసి



విలేకరులతో మాట్లాడుతున్న ఛత్తీష్‌గడ్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్ గఢ్‌కి చెందిన నలుగురు పాత్రికేయులను గంజాయి కేసులో అరెస్టు చేయడం వెనుక బీజేపీ కుట్ర ఉందని ఛత్తీస్‌గడ్ మాజీ మంత్రి మోహన్ మార్కవన్, మరో మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే కవాసి లఖ్మ ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న నలుగురు పాత్రికేయులను ఆ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మార్కవన్, లఖ్మ, సిట్టింగ్ ఎమ్మెల్యే విక్రమ్ మాండవి, మాజీ ఎమ్మెల్యే రేఖ్‌చంద్ జైన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వరి భాగేల్, జడ్పీ చైర్మన్ హరీశ్‌కవాసి ములాఖత్‌పై సోమవారం కలిశారు. అనంతరం జైలు బయట వారు మా ట్లాడుతూ.. ఛత్తీస్‌గడ్- ఆంధ్రా సరిహద్దులో అక్రమంగా ఇసుక తవ్వుతున్న కాంట్రాక్టర్లను ఆ నలుగురు విలేకరులు వెళ్లి ప్రశ్నించా రన్నారు. వాళ్లకి ఆ కాంట్రాక్టర్లు మంచి మాటలు చెప్పి భోజనానికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ముందుగా వేసిన ప్లాన్ ప్రకారం భోజనం చేస్తుండగా వారి కారులో దొంగ తనంగా గంజాయిని ఉంచారని చెప్పారు. ఈ విషయం తెలియని విలేకరులు ఆ కారులో ఆంధ్రాలో ప్రవేశించగానే పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఈనెల 11న సీజీ 18 ఎల్ 0698 నంబరు కలిగిన కారును చింతూరు పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా సోదా చేశారు. కారులో 3 ప్యాకెట్లలో 15కి లోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కారులో ఉన్న దంతెవాడజిల్లా దక్షిణ బస్తర్‌కి చెందిన బప్పిరే(ఏ3), అదే జిల్లాలోని రాంపూర్ క్యాంప్‌కి చెందిన శివేందు త్రివేది(ఏ4), సుకుమా జిల్లా నకపర వార్డుకు చెందిన ధర్మేంద్రసింగ్(ఏ5), అదే జిల్లా కుంటకు చెందిన మనీష్‌సింగ్ అనే విలేకరులను అరెస్టు చేశారన్నారు. క్రైం నెం.62/2024 అండర్ సెక్షన్ 8(సీ) రెడ్ విత్ (బీ)(2) (బీ) ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలతో నిందితులను సెంట్రల్ జైలుకు తరలించినట్టు పేర్కొన్నారు. విలేకరులను కేసులో ఇరికించ డానికి కారులో గంజాయిని ఉంచారని అక్కడి సీసీ కెమెరాల ద్వారా స్పష్టమైనట్లు తెలుస్తోందన్నారు. కారులో గంజా యి పెట్టారని భావిస్తున్న కుంటకు చెందిన ఇర్షాద్, పవన్ లను కేసు నమోదులో ఏ1, ఏ2లుగా పేర్కొన్నారన్నారు. వీళ్ల కోసం గాలిస్తున్నారు. సీసీ ఫుటేజీలను మాయం చేసిన ఛత్తీస్‌గడ్ ఎస్ఐని అక్కడి పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుమారు 20 మందితో కూడిన కాంగ్రెస్ బృందం జైలుకు వచ్చి విలేకరులకు భరోసా ఇవ్వడం ప్రాధాన్యం సంతరించు కొంది. వారికి బెయిల్ విషయంలో సహాయం చేస్తామన్నారు. అధికార బీజేపీ ప్రభుత్వపాత్ర ఉందని ఆరోపించారు.

టాయిలెట్ ఫోటోలు అప్‌లోడ్‌పై విధి విధానాలు విడుదల

తొండంగి, ఆగస్టు 19: పాఠశాలల్లోని టాయిలెట్ ఫోటోలు ఎవరు తీయాలి, ఎవరు అప్‌లోడ్ చేయాలన్న దానిపై ప్రభుత్వం విధివిధానాలను విడుదల చేసింది. దీని ప్రకారం ఇకపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఐఎంఎంఎస్ యాప్‌లో టాయిలెట్ ఫోటోలను అప్‌లోడ్ చేయాల్సిన పనిలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రతిరోజు సాయంత్రం సర్వే ఫారమ్ పూర్తి చేయవలసి ఉంది. దీనిలో ఆయా హాజరు, టాయిలెట్ల పరిస్థితి, రన్నింగ్ వాటర్ లభ్యత, ఎన్నిసార్లు శుభ్రపరిచారన్న వివరాలు నమోదు చేయాలి. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతి సోమ, గురువారాలు పాఠశాలను సందర్శించి ఐఎంఎంఎస్ యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేయాలి. టాయిలెట్ల శుభ్రత, వాష్‌బేసిన్, యూరినల్స్ పరిస్థితి తదితర అంశాల పై రిమార్కులతో ఫోటోలు అప్‌లోడ్ చేయాలి. వీరితో పాటు విద్యాకమిటీల అధ్యక్షులు, సభ్యులు ప్రతి బుధ ,శుక్రవారాల్లో పాఠశాలలను సందర్శించి టాయిలెట్ ఫోటోలను అప్‌లోడ్ చేయాలి. వీరికి ఐఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఏజెన్సీ సమాచారం

చింతూరు ఏఎస్పీగా పంకజ్‌కుమార్ మీనా బాధ్యతల స్వీకరణ



చింతూరు, ఆగస్టు19: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏఎఎస్పీగా పంకజ్‌కుమార్ మీనా నియమితుల య్యారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. పంకజ్ కుమార్ మీనా ఇప్పటివరకు గ్రేహౌండ్ విభా గంలో అశాల్ట్ కమాండర్‌గా విధులు నిర్వర్తించారు. చిం తూరు ఏఎస్పీగా విధులు నిర్వర్తించిన రాహుల్ మీనాకు ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ ఎస్ఆర్పీ గుంతకల్ బదిలీ చేసిన విషయం విధితమే.

వై.రామవరం తహశీల్దార్‌గా అనసూయ



వై.రామవరం, ఆగస్టు 19: వై.రామవరం మండలం తహ సీల్దార్‌గా కె.అనసూయ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇప్పటివరకు ఎన్నికల విధుల్లో భాగంగా విజయవాడ లో పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు పని చేసిన తహసీల్దార్ నాగరాజు ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

ఐటీడీఏ గ్రీవెన్సుకు 30 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 19: ఐటీడీఏ కార్యాయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 30 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఆయన సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్, ఏపీఎవో(జీ) సీహెచ్ కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని, పింఛన్లు మంజూరు, రోడ్లు ఏర్పాటు, సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఇనస్పెక్టరు ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, డీఎల్‌పీవో రఘునందన్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇనస్పెక్టర్లు బాబురావు, రాజశేఖర్, తహశీల్దారు కృష్ణజ్యోతి, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఏపీడీ ఎ.శ్రీనివాస రావు, డాక్టరు ఇందిరా, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, ఈఈలు జి.డేవిడ్‌రాజ్, ఎండీ యూసఫ్, రవికుమార్, సుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సబ్జెక్టుల్లో ప్రావీణ్యం పొందేలా చర్యలు చేపట్టాలి

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 19: విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో ప్రావీణ్యం పొందే లా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో 11 మండలాల విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడు తూ విద్యార్థుల సామర్థ్యం తెలుసుకొనేందు మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు బేస్‌లైన్ అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థు లకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థు లకు భోజన సౌకర్యాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యువోలు రామతులసి, కృష్ణమోహన్, డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చిన్నిబాబు, 11 మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధా నోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల మంజూరుకు గ్రామసభలు

ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో ఈనెల 23వ తేదీన సర్పంచ్‌అధ్యక్షతన ఉపాధి హామీలో కొత్త పనుల మంజూరుకు గ్రామ సభలు నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఉపాధిహామీ పథకం అధికారులతో గ్రామసభల నిర్వహణపై సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన కొత్తపనుల మంజూరుకు గ్రామసభల్లో తీర్మా నిస్తామన్నారు. గ్రామసభకు రెండు రోజుల ముందు గ్రామాల్లో దండోరా వేయిం చాలని అధికారులను ఆదేశించారు. ఏపీడీ జి.శ్రీనివాసరావు, డీఎల్‌పీవో రఘునం దన్, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీవోలు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న జమాల్‌ఖాన్



ఆర్థిక సహాయం అందజేస్తున్న జమాల్‌ఖాన్

కూనవరం, ఆగస్టు 19: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు మరోసారి తన మానవత్వాన్ని చాటుకు న్నారు. ఇప్పటికే జమాల్‌ఖాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన వేలాది మందికి సాయం అందించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా పైడిగుడెంలో మరోసారి వికలాంగుడికి తన సాయం అందించారు. బత్తుల కొమరయ్య ఇటీవల ప్రమాదవశాత్తు తన కాలుకి మేకు గుచ్చుకోవడంతో అధికాస్త సెప్టిక్ అయింది. దీంతో అతని కాలును వైద్యులు తీసి వేయాల్సి వచ్చింది. దీంతో కొమరయ్య వికలాంగుడిగా మారాడు. విషయం తెలి సిన ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ స్పందించి జైపూర్ నుంచి కృత్రిమకాలు తయారుచేయించి అందిస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల వచ్చిన వరదల్లో ఉదయభాస్కరకాలనీలో పూర్తిగా ఇళ్లు కొట్టుకుపోయిన నలుగురు ఒంటరి మహి ళలకు సాయం అందించారు. కార్యక్రమంలో ఎడవిల్లి భాస్కరరావు, పొడియం అప్పారావు, చెలకాని ఉమామహేశ్వరరావు, సుఫీ పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ



కూనవరం, ఆగస్టు 19: అన్నాచెల్లెల్ల మధ్య ప్రేమను పంచే రాఖీ పండుగ కూనవరంలో ఘనంగా జరిగింది. సోదరీమణులు తమ సోదరుల ఇంటికి వెళ్లి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కూనవరంలో మాజీ జడ్పీటీసీ కన్యకాపరమేశ్వరి పలువురు సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

అటవీప్రాంతంలో పర్యాటకం అభివృద్ధికి చర్యలు

● సీసీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి

రాజవొమ్మంగి ఆగస్టు 19: అటవీప్రాంతంలో ఉన్న పర్యాటకం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సీసీ ఎఫ్‌వో వై.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండ లంలో జాతీయరహదారి నిర్మాణంలో అటవీప్రాంతం ఉండటంతో ఆ అటవీప్రాం తానికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూమిని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం రాజవొమ్మంగి అటవీశాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రాజవొమ్మంగి అటవీరేంజ్ కార్యాలయంలో మౌళికసదుపాయలు మెరుగు పరిచే విధంగా సిసిఎఫ్ఓ చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న పాపికొండల నేషనల్ పార్కు ప్రాంతాన్ని ప్రత్యేక డివిజన్ చేసి అభివృద్ధి చేసే యోచనలో ఉన్నామన్నారు. అలానే తన పరిధిలో వచ్చే ఏడాదికి 75లక్షల కొత్త మొక్కలు నాటామన్నారు. నదులలో బోట్ల సంఖ్యను పెంచి పెట్రోలింగ్‌ను బలోపెతాం చేసి స్మగ్లింగ్‌ను అరికట్టే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. స్క్వాడ్ డిఎఫ్‌వో ఎ.త్రిమూర్తులు రెడ్డి, సబ్ డీఎఫ్‌వో శ్రీరామరావు, రేంజర్ మడకం అబ్బాయిదొర, సిబ్బంది ఉన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎటపాక, ఆగస్టు19 కలకత్తాలో జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని పేర్కొంటూ సోమవారం ఏటీఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఎటపాక ప్రధాన సెంటర్ నుంచి తెలంగాణ సరిహద్దు ప్రాంతంవరకు ర్యాలీగా తరలి వెళ్లారు. మహిళలపై అత్యాచార దాడులు, హత్యలపై కఠిన చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. నిందితులకు ఉరిశిక్ష అమలు చేయాలని నినదించారు. ఈకార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర నాయకులు పూనం శ్రీను,ఎటపాక ఏటీఏ మండ ల అధ్యక్షుడు కాక రాజు,ఏటీఏ మహిళా నాయకులు పూజిత, రజిని, విజయ పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19 : బోధనలో కంటెంట్ జనరేషన్ కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్ల శిక్షణ సోమవారంతో ముగి సిందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. కళా శాల విద్యా కమిషనరేట్ ఆధ్వర్యంలో నోడల్ రిసోర్సు సెంటర్ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి ప్రతిరోజూ సుమారు 20 మంది ట్రైనర్లకు కళాశాల లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం స్టూడి యో కో ఆర్డినేటర్ బి.వెంకట్రావు శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణ పొందిన ట్రైనర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల రక్షణకు కూటమి చర్యలు

» రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 19: మహిళల రక్షణకు తమ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మె ల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం తెలుగు మహిళలు ఎమ్మెల్యే వాసుకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళలో మన తల్లిని, చెల్లిని, అక్కను, చూసుకో వాలన్నారు. మహిళా కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలకు భద్రత పెరి గిందన్నారు. కార్యక్రమంలో కోసూరి చండీప్రియ,ద్వారా పార్వతీ సుందరి, కప్పల వెలు గుకుమారి, తురకల నిర్మల, బోను ఈశ్వరి, మీసాల నాగమణి, అస్సరి, లక్ష్మీనాయుడు, శ్రీలత, కోన సత్య, మోతా నాగమణి పాల్గొన్నారు.



టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరికి రాఖీ కడుతున్న ఎమ్మెల్యే బత్తుల సతీమణి వెంకటలక్ష్మి

కోరుకొండ: రాఖీ పౌర్ణమి సందర్భంగా కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కొండ చుట్టూ భక్తులు మూడు సార్లు గిరిప్రదక్షణ చేశారు. అలాగే ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరికి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. పలువురు మహి ళలు ఎమ్మెల్యే బత్తులకు రాఖీలు కట్టారు.



అనపర్తి: రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లికి రాఖీ కట్టిన తెలుగు మహిళలు



రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే వాసుకు రాఖీలు కడుతున్న తెలుగు మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పలు గ్రామాల నుంచి తెలుగు మహిళలు, మహిళా కార్య కర్తలు రాజమహేంద్ర వరంలోని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నివాసానికి చేరుకుని ఆయనకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా వారికి గోరంట్ల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్ర మంలో పిల్లా తనుజ, దండమూడి ప్రమీళ, బోడపాటి రాజేశ్వరి, మద్దా మణి, ముత్త బత్తుల విజయ, భైరెత్తి సరోజినీదేవి, సింహ నాగమణి, పత్తి మంగా, బండి నాగమణి, అలేఖ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గోరంట్లకు రాఖీ కడుతున్న మహిళ

అనపర్తి: మండలంలోని రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. నల్లమిల్లి సోదరీమణులు రామవరం చేరుకుని ఆయనకు రాఖీ కట్టారు. అలాగే తెలుగు మహిళలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మల్లిడి సురేంద్రరెడ్డికి ఎమ్మెల్యే నల్లమిల్లి సతీమణి మహా లక్ష్మి రాఖీ కట్టి సోదర భావాన్ని చాటారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, సుభాషిణి, కర్రి సత్యగౌరి, బేరా వేణమ్మ, సిరసపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

రూ.8 కోట్లతో నాలుగు గ్రామాల్లో సీసీ రోడ్లు

» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, ఆగస్టు 19: మండలంలోని నాలుగు గ్రామాల మధ్య అంతర్గత రోడ్లును అభివృద్ధి చేయడం కోసం సుమారు రూ.8 కోట్లు ఖర్చు చేయను న్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పలు గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు టీడీపీ నియో జకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి ఆయన శంకుస్థాప నలు చేశారు. ముందుగా కణుపూరు శివాలయం వద్ద మల్లికార్జునస్వామి కొం డ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం కొండ నుంచి గాదరాడ వరకు, గాదరాడ, నందరాడ మధ్య నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. తదుపరి గాదరాడలో నిర్మించనున్న సీసీ డ్రైన్‌కు, పాత మునగాల, కొత్త మున గాల మధ్య నిర్మించే సీసీ రోడ్డుకు, కోటికేశవరం, బొల్లేద్దుపాలెం గ్రామాల మధ్య నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెర వేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకుడు ఏపీఆర్‌చౌదరి, గాదరాడ సర్పంచ్ దూది కాంతారావు, తన కాల నాగేశ్వరరావు,కంటే నాగకేశవరావు, అడపా గంగరాజు, కేశవరం సర్పంచ్ మూడే సింధుదివ్య, మాదబోయిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



గాదరాడలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి

ఘనంగా గోపూజ మహోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 19: ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం, శ్రీ రంగా రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగం గా సోమవారం బలరామ జయంతి నిర్వహించారు.ఆశ్రమ వ్యవస్థాపకులు త్రిదండి స్వామి భక్తి వైభవ పూరీ గోస్వామి మహరాజ్, భక్తి కంకణ బన మహరాజ్ చేతులమీదుగా ఉదయం గోపూజ చేశారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన భగవద్గీత పోటీల్లో 200 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్టు ఆశ్రమం ఇన్‌చార్జి హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. కార్యక్రమంలో గోశాల నిర్వాహకులు గోకుల్ టీవీఎస్ అధినేత నారా వీవీ సత్యనారాయణ, వెంకటే శ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి, ఎస్‌బీ మోటార్స్ అధినేత ఎం.రంగ ప్రసాద్, పీవీఎస్ కృష్ణారావు, భక్తులు పాల్గొన్నారు.

మహంతి లక్ష్మణరావుకు సత్కారం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19 : జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సీపీఐ సీనియర్ నాయకుడు మ హంతి లక్ష్మణరావును సోమవారం సీపీఐ నాయకులు సత్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ బ్యాంకు డైరెక్టర్‌గా లక్ష్మణరావును ఏకగ్రీ వంగా ఎన్నిక చేసినందుకు చైర్మన్ బొమ్మన జయకుమార్, ఇతర ప్రజాప్రతి నిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహా య కార్యదర్శి, జట్ల సంఘం అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సప్ప రమణ, సేపేని రమణమ్మ, నౌరోజీ, టి.నాగేశ్వరరావు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 19: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ కేతన్ గార్గ్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 13 అర్జీలు వచ్చాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉన్నారు. టిడ్కో ఇళ్లు , పారిశుధ్యం, డ్రైనేజీ, మురుగునీరు, ఇంటి పన్ను, వీధి దీపాల స మస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. గోదావరి పరిరక్షణ సమితి చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి కమిషనర్ కేతన్‌ను కలిసి గోదావరి పుష్కరాల నాటికి అన్ని సమస్యలను పరిష్కరించాల న్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరి ష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

'మూఢ నమ్మకాలు లేని సమాజం ఏర్పడాలి'

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19 : ప్రయోగాలకు నిలిచింది మాత్ర మే సైన్స్ అని, మూఢ నమ్మకాలు లేని సమాజం ఏర్పడాలని జన విజ్ఞాన వే దిక తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు బి.మల్లికార్జునరావు అన్నారు. జ న విజ్ఞాన వేదిక తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాజ మహేంద్రవరంలోని ఆర్యవైశ్య సదనంలో సైన్స్ అవగాహన సదస్సు నిర్వ హించారు. చెక్కా తాతారావు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని, తమను తాము గౌరవించుకోవాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక మెజీషియన్ సీహెచ్ శ్రీరాములు మ్యాజిక్ ప్రదర్శన నిర్వహించారు. మేజిక్ అనేది కేవలం హస్తలాఘవం మాత్రమే అన్నారు. విద్యార్థులకు ఉప యోగపడే సైన్స్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ చేపూరు రత్నమహాలక్ష్మి, సీతా మహాలక్ష్మి, సీహెచ్ నిశ్చల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

కాటవరంలో ఘటన..యూటర్న్ తీసుకుంటుండగా ఘటన

సీతానగరం, ఆగస్టు 19: మండలంలోని కాటవరం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటిపాక మండలం నెల్లిపాక గ్రామానికి చెందిన కరుటూరి సూర్యప్రకాశ రావు(72) రఘుదేవపురం నుంచి వలస వెళ్లారు. తన స్వగ్రామమైన రఘుదే వపురంలోని బంధువుల ఇంటికి, కాటవరంలోని తన బావమరిది ఇంటికి వచ్చి తిరిగి రాజమహేంద్రవరం వెళ్లే ప్రయత్నంలో కాటవరం గ్రామం వద్ద యూటర్న్ తీసుకునేందుకు ఒక్కసారిగా ద్విచక్రవాహనం మలుపుతిప్పడంతో రాజమహేంద్రవరం నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో సూర్య ప్రకాశరావు తీవ్రంగా గాయపడ్డాడు. రాజహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా సూర్య ప్రకాశరావు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సీతానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నట్టు తెలిపారు.

నిందితులను ఉరితీయాలి

కడియంలో విద్యార్థులు ర్యాలీ

కడియం, ఆగస్టు 19: ట్రైనీ డాక్టర్‌ను పొట్టనబెట్టు కున్న నిందితులను ఉరితీయాలని, ఆడపిల్లలకు రక్ష ణ కల్పించాలని కడియంలో విద్యార్థినులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ ప్రారంభించిన ఈ ర్యాలీలో ఉపాధ్యాయుడు గొల్ల పల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశం ఆదర్శవంతంగా ఉండాలంటే కఠిన మైన శిక్షలు అమలు చేయాలన్నారు. ఆడపిల్లలకు ఏమైనా సమస్యలు ఎదురైతే 100కు ఫోన్ చేయాలని, అపరిచితులకు దూరంగా ఉండాలని ఎస్ఐ దుర్గాప్రసాద్ సూచించారు. ఈ సందర్భంగా పోలీసులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు బి.సువర్ణవేణి, పంతం శ్రీవెంకటదుర్గ, ఎం.డేవిడ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాతేరులో వదిలేసిన చెట్ల కొమ్మల తొలగింపు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 19: కాతేరులోని గణపతినగరంలో వదిలేసిన చెట్ల కొమ్మలతో పాటు చెత్తా చెదారాలను ఎత్తివేసారు. కాతేరులో ట్రాన్స్‌కో సిబ్బంది నరికిన కొమ్మలను అలాగే వదిలేసారని సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ అధికారి మొదలు కొని పారిశుధ్య సిబ్బంది వరకు సోమ వారం గ్రామంలో కలియదిరిగి చెత్తా చెదారాలను ట్రాక్టర్‌లో డంప్ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది అదే పనిలో ఉన్నారు. ప్రతి రోజు నిర్లక్ష్యం లేకుండా గ్రామంలో పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తే ఎటువంటి అపరిశుభ్ర వాతావరణం ఉండదని, అనారోగ్య సమస్యలు తలెత్తవని స్థానికులు అంటున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రాజమహేంద్రవరం ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం న గరపాలక సంస్థ లాలాచెరువు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిపై దాడి చేసిన విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవా లని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు సోమ వారం త్రీటౌన్ సీఐను కలిసి ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విధినిర్వహణలో ఉన్న ఉపాధ్యాయిని విద్యార్థిని సంస్కరించడంలో భాగంగా మందలిస్తే ఆ విద్యార్థి తల్లిదండ్రులు వచ్చి దాడి చేయడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

అనపర్తి ఎస్ఐగా శ్రీనునాయక్



అనపర్తి, ఆగస్టు 19 : అనపర్తి ఎస్ఐగా ఎల్.శ్రీను నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రామారావు పెదపూడి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా ఆలమూరు ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీను నాయక్ అనపర్తి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీను నాయక్ రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

టెంపుల్ టూరిజంగా అనపర్తి

అనపర్తి, ఆగస్టు 19: నియోజకవర్గాన్ని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయాలని సంకల్పించాలని ఈ దిశగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పం పించామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నా రు. సోమవారం బిక్కవోలు మండలం బలభద్రపు రంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధిపై అధికారులు, దాతలు, కూటమి నాయకులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమీక్షలో ఆర్జేసీ సుబ్బారావుతోపాటు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, ఈవోలు, దాతలు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

రంగంపేట, ఆగస్టు 19: ఈ నెల 20వ తేదీ నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు మండలంలోని అన్ని పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్టు రంగంపేట, వడిశలేరు పశువైద్యాధికారులు జహంగీర్, జాన్ పాల్ తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం, చూడి పశువులు ఈసుకు పోవడం, నోటిలో పుండ్లు కారణంగా మేత తినలేక నీరసించి పోవడం, కాలి గిట్టల్లో పుండ్లు కారణంగా నడవలేక పోవడం, పాడి పశువుల్లో పాల దిగు బడి తగ్గిపోవడం, వ్యాధి తీవ్రమైనప్పుడు పశువులు చనిపోయే అవకాశం ఉంటుందన్నారు. సెప్టెంబరు 18వ తేదీ వరకు అన్ని రకాల పాడి పశువు లకు రైతుల ఇంటి వద్దకే పశుసంవర్ధక శాఖ సిబ్బంది వచ్చి పశువులకు టీకాలు వేస్తారని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని పశువైద్యాధికారులు కోరారు.

ఇన్‌చార్జి కార్యదర్శి నిధుల దుర్వినియోగం

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దుళ్ల సర్పంచ్

కడియం, ఆగస్టు 19: కడియం మండలం దుళ్లలో ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన మురమండ కార్యదర్శి సరోజరాణి తన ఉద్యోగ సమయంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని, డిజిటల్ సిగ్నేచర్ ఉపయో గించి సుమారు రూ.2,78,758 దుర్వినియోగం చేశారని సర్పంచ్ కొండపల్లి పట్టియ్య సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంతేగాక బదిలీయైనా చార్జి, రికార్డులు అప్పగించలేదని, పంచాయతీ నిధులను ఇష్టానుసారం ఖర్చుపెట్టడం ఎంత వరకు సమంజసమని గతంలో డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేశామని, అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

రాజానగరం, ఆగస్టు 19: మండలంలో చక్రద్వారబంధం గ్రామంలో ఈ నెల 16న జరిగిన చోరీ కేసులో నిందితుడికి రిమాండ్ విధించినట్టు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన మేడిశెట్టి సూర్యకాంతం అనే వృద్ధురాలు మేనల్లుడితో కలిసి జీవిస్తోంది. ఈ నెల 16న ఇంట్లో ఒంటిరిగా ఉండడం గమనించిన సమీపంలోని రాయుడు అప్పారావు అలియాస్ పండు అనే యువకుడు ఇంట్లోకి ప్రవేశించి సూర్య కాంతం మెడలో ఉన్న రెండు కాసుల బంగారు గొలుసుతో పాటుగా చెవి దిద్దులను బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనుమానితుడిగా భావించిన అప్పారావును అదుపులోకి తీసుకుని విచారించగా నిజం అంగీకరించాడు. బంగారు గొలుసు విలువ రూ.లక్ష ఉంటుందని, అతడిపై గతంలో బంగారం దొంగతనం కేసు ఉందన్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు సీఐ తెలిపారు.

డ్వాక్రాలకు రుణాల మంజూరు వేగవంతం



అనపర్తి, ఆగస్టు 19: డ్వాక్రా మహిళ లకు యూనియన్ బ్యాంక్ రుణాలు మంజూరు చేస్తూ అందిస్తున్న సేవల ను చేరువ చేయాలని యూనియన్ బ్యాంక్ అనపర్తి శాఖ చీఫ్ మేనేజర్ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా శాఖలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సతీష్‌కుమార్ డ్వాక్రా యానిమేటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు బ్యాంక్ అందిస్తున్న రుణాల మంజూరు వేగవంతం చేస్తున్నామన్నారు. మహిళలు రుణాలు చెల్లింపులో వారే స్వ యంగా బ్రాంచి నగ దు కౌంటర్‌లో మా త్రమే చెల్లింపులు చేసి రశీదులు పొం దాలన్నారు. తమకు ఎదురయ్యే సమస్య లను నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి సిబ్బంది సిద్ధంగా ఉంటారని అన్నారు.

వైద్య ఉద్యోగి విల్సన్‌పాల్‌కు సత్కారం

కడియం, ఆగస్టు 19: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న సీహెచ్ విల్సన్‌పాల్‌ను సోమవారం వైద్య ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎం.మణి జ్యోత్స్న, డాక్టర్ నాగసాయిమౌర్య, ఆరోగ్య విస్తరణాధికారి ఎంబీబీ రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

23న ఉపాధిహామీ గ్రామ సభలు

రంగంపేట, ఆగస్టు 19: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పనులు ప్రతిపాదించేందుకు, సిబ్బం దిని నియమించేందుకు మండలంలోని 17 గ్రామాల్లో ఈ నెల 23న పంచా యతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీవో పి.వెంకటరత్నం సోమవారం రాత్రి ఆదేశాల జారీ చేశారు. ఉపాధి హామీ పథకంలో వేతనాలు, పనివారికి ఉన్న హక్కుపై అవగాహన కల్పిం చడం, ఇప్పటికే మంజూరైన పనులు ప్రగతిని చదివి విని పించడం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొత్త పనులు ప్రతిపాదించడం, సామాజిక తనిఖీ ప్రాముఖ్యతపై సభ ల్లో ప్రజలకు అవగా హన కల్పించాలని ఎంపీడీవో చెప్పారు.

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, (రుడా)

RUDA

హెచ్చరిక

ప్రజలకు తెలియచేయడము ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరిచిన స్థలము/ప్లాట్లు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికముగా లే అవుట్లు వేసియున్నారు.

క్ర. సం.	అనధికార లే అవుట్ పేరు	విస్తీర్ణము (ఎకరాలలో)	సర్వే నెంబర్	గ్రామము	మండలము	జిల్లా పేరు
1.	గరికిపాటి డెవెలపర్స్	15.54	367/2,368/1, 369, 370/2	వడిసలేరు	రంగంపేట	తూర్పుగోదావరి
2.	గరికిపాటి వెంకటేశ్వరరావు	3.05	365/3,365/4	వడిసలేరు	రంగపేట	తూర్పుగోదావరి
3.	కుంచె నాగ బంగారమ్మ w/o అమ్మి రాజు	1.37	17/2,17/3P	సూరపురం	నిడదవోలు	తూర్పుగోదావరి
4.	శ్రీ వరలక్ష్మి విహార్ లే అవుట్	3.485	97/5&97/6P	కాతేరు	రాజమహేంద్రవరం రూరల్ మండలం	తూర్పుగోదావరి
5.	వెల్ల రోడ్డు	7.00	39/9,40/5, 43/5,44/3	యేరుపల్లి	రామచంద్రాపురం	డా.బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ
6.	శీలం వారి సవరం రోడ్డు	3.50	31/1,35/3,4	యేరుపల్లి	రామచంద్రాపురం	డా.బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ
7.	కాకినాడ రోడ్డు	2.00	318/P	రామచంద్రాపురం	రామచంద్రాపురం	డా.బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ
8.	స్వగృహ లేఔట్	0.62	310/1	రావులపాలెం	రావులపాలెం	డా.బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ


కావున పైన తెలియపరిచిన లే అవుట్ల నందు స్థలము/ప్లాట్‌లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ఈ ప్లాట్లకు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయబడవు మరియు ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంట్, నీరు, డ్రైనేజి సదుపాయాలు కల్పించబడవు. దీనిని గమనించవలసినదిగా విజ్ఞప్తి.

గమనిక:- అనధికారముగా లే అవుట్ వేసి మరియు అమ్మకాలు చేయుచున్న స్థల యజమానుల లేదా డెవలపర్ల పైన చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయి.

సం/- వైస్-ఛైర్ పర్సన్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

మంగళవారం 20 ఆగస్టు 2024 | 5

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పాము హల్‌చల్

రాజమహేంద్రవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలోకి పెద్ద పాము దూరడంతో రోగులు బెంబేలెత్తిపోయారు.కంటి వైద్య వార్డులో సోమవారం మధ్యాహ్నం నర్సుకు ఒక పెద్దపాము కనిపించింది. దీంతో ఆమె పెద్దగా పాము పాము అంటూ కేకలు వేస్తూ బయటికి పరుగుపెట్టింది. సమాచారం తెలియడంతో పెస్ట్ కంట్రోల్ విభాగం ఇన్‌చార్జ్ ఎస్.అప్పన్న అక్కడికి వెళ్లి విషయం బయటకి రానివ్వలేదు. లోపలికి ఎవరిని వెళ్లనివ్వకుండా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఒక రోగి బంధువు వెళ్లి ఆ పాము(జర్రిగొడ్డు)ను కొట్టి బయటపడేశాడు. దీంతో రోగులు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా ఆసుపత్రిలోకి పాము దూరడం తీవ్ర కలకలంరేపింది. నిత్యం రద్దీగా ఉండే ఆసుపత్రిలో పాము ఎలా వచ్చిందనే దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.దీనిపై ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించకపోవడం గమనార్హం.

ఛాయ్..చమక్కు!



ఏ చాయ్ చటుక్కున తాగరా భాయ్..ఈ ఛాయ్ చమక్కులే చూడరా భాయ్.. అని చిరంజీవి అన్నారు.. మంత్రి దుర్గేష్ కూడా ఏ కార్యక్రమానికి వచ్చినా టీ చుక్క గొంతులో పడాల్సిందే.. పెరవలిలో సోమవారం ఒక కార్యక్రమానికి హాజరైన మంత్రి వచ్చీ రావడంతోనే టీకావాలని కోరారు.. దీంతో జనసేన గ్లాస్‌లో టీ తెచ్చి ఇచ్చారు. దీనిపై విలేకరులు ప్రశ్నించగా..టీ అంటే తనకు ఎంతో ఇష్టమని.. అది కూడా మా గుర్తు గాజు గ్లాసులో తాగడం అంటే మరీ ఇష్టమని చెప్పుకొచ్చారు.. - పెరవలి

ఇసుగెత్తిస్తోంది!

అందుబాటులో ఇసుక అందనంత ఎత్తులో ధర



ఐదు యూనిట్లు.. రూ.23 వేలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 19 : ఇసుక కష్టాలు ఇంతింతకాదయా.. ప్రభుత్వం ఉచితమన్నా ఎక్కడా ప్రభుత్వం చెప్పినట్టు లేదు.. వేలకు వేలు చెల్లించాల్సిందే.. పాలకులు మారినా కొన్ని సమస్యలకు పరిష్కారం మాత్రం దొరకడం లేదు. ఉచిత ఇసుకపాలసీని కూటమి ప్రభుత్వం ప్రకటించినా అందుకు తగ్గట్టుగా చర్యలు కానరావడంలేదు. ఎవరు అధికారంలో ఉన్నా ఇసుక తీరు మారడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు మాయమైపోయాయి. గోదావరి వరదలతో ఇసుక రీచ్‌లు ఆగిపోవడంతో కొద్ది రోజులుగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. వరదలు తగ్గినా ఇసుకతీతకు అనుమతులివ్వలేదు. ప్రస్తుతం కోనసీమ జిల్లా రావులపాలెం, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం పెండ్యాల రెండు ర్యాంప్‌ల నుంచి మాత్రమే ఇసుక సరఫరా జరుగుతోంది. మిగిలిన ర్యాంప్‌లు అన్నీ మూతపడ్డాయి.దీంతో ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత ఏర్పడింది.

- ఇసుకపై బాదుడే..బాదుడు
- వరదతో ర్యాంపుల మూసివేత
- డిమాండ్ మేరకు సరఫరా కాని వైనం
- రెండు ర్యాంపుల నుంచే ఇసుక
- కూటమి ఉచితం..హుష్‌కాకి
- ఐదు యూనిట్లు ఏకంగా రూ.23 వేలు
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు
- నిలిచిపోతున్న భవన నిర్మాణాలు

భవన నిర్మాణదారుల గగ్గోలు

శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉండడంతో అనేక మంది ఇళ్ళ నిర్మాణాలు తలపెట్టారు. వారంతా ఇసుక ధరలకు నోరెళ్లబెడుతున్నారు.ఇదేంటి ఉచిత ఇసుక అన్నారు కదా అని ఆశ్చర్యపోతున్నారు. వాస్తవానికి టన్ను ఇసుక రూ.420 ఉండేది.. అయితే ప్రస్తుతం ఏర్పడిన కృత్రిమ కొరతతో వినియోగదారుడికి చేర టన్ను వెయ్యి రూపాయలు పైబడే అవుతుంది. దీంతో ఇళ్ల నిర్మాణాలను చాలా మంది నిలుపుదల చేసుకున్నారు. నిర్దేశిత సమయానికి ఇళ్లు కట్టిస్తామని కాంట్రాక్టు పద్ధతిలో ఒప్పుకున్న బిల్డర్లు తలలుపట్టుకుంటున్నారు. ఇసుక ధరకే అంతపెడితే ఇక దీనిపై వచ్చే మార్జిన్ కూడా పెద్దగా ఉండదనే ఆందోళనలో ఉన్నారు. కొంత మంది నిర్మాణాలు నిలుపుదల చేసుకుని ఇసుక అందుబాటులోకి వచ్చాక పనులు మొదలు పెడదామని ఆగిపోయారు. ఇటువంటి వారంతా ఇసుక ధరలు అందుబాటులోకి వచ్చే రోజు కోసం ఎదురుచూస్తున్నారు. నిర్మాణాలు ఆగిపోవడంతో దానిపై ఆధారపడి జీవనం సాగించే మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు,ఎలక్ట్రీషియన్లు, రాడ్‌బెండర్లు,వెల్డర్లు, పెయింటర్లు ,వడ్రంగి పనివార్లు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఐదు యూనిట్ల ఇసుక రూ23వేలు పైమాటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేవలం 2 ర్యాంప్‌లు మాత్రమే పనిచేయడంతో ఇసుకకు విపరీతమైన డిమాం డ్ ఏర్పడింది. ఫలితంగా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలకు ఐదు యూనిట్ల ఇసుక వినియోగదారుడికి చేర్చడానికి రూ.23వేలు పైబడి ధరలు పలుకుంది. 10 టన్నుల ఇసుక రూ.14 వేలు పలుకుతుంది.సాధారణంగా ఐదు యూనిట్ల లారీ ఇసుక ధర రూ.8400, పది టన్నుల ఇసుక ధర రూ.4200 ఉండేది.. కానీ ప్రస్తుతం ధరలు చూస్తే గుండె గుబేల్‌మంటుంది. కోరుకొండ, గోకవరం, జగ్గంపేట వంటి ప్రాంతాలకు ట్రాన్స్‌పోర్టు అదనంగా చేర్చి ఐదు యూనిట్ల లారీ రూ.26 వేలకు అమ్ముతున్నా రు. రావులపాలెం, పెండ్యాల ర్యాంపుల్లో రూ.8400 అద నపు చార్జీలు కలిపి మొత్తం రూ.11 వేలకు వచ్చే ఇసు కకు ట్రాన్స్‌పోర్టు చార్జీ అధికమవుతుంది. ఫలితంగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొవ్వూరు, తాళ్ళపూడి, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ పరిధిలోని గాయత్రి, కోటిలింగాలు, కాతేరు, వేమగిరి ఇసుక ర్యాంప్‌లు ఉన్నా యి. వరదల కారణంగా ర్యాంపులన్నీ మూతపడి ఉం డడంతో దూర ప్రాంతాల నుంచి ఇసుకను తీసుకువస్తు న్నారు. దీంతో ధరలు పెరిగిపోయాయి. మరికొంత మంది అక్రమార్కులైతే గత ప్రభుత్వ హయాంలో నిల్వచేసిన ఇసుక డంప్‌లను ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే మూడు రోజుల్లో లిఫ్ట్ చేసేశారు. కొంత మంది ఈ డంప్‌లను ప్రైవేట్ స్థలాల్లో స్టాక్ పెట్టుకుని ఇప్పుడు బ్లాక్‌లో ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు.



ఇసుక బ్లాక్ మార్కెట్ ఎక్కువైంది..



కూటమి ప్రభుత్వం ఇచ్చిన వెంటనే ఇసుక ఉచితం అన్నారు.. చాలా ఆనందపడ్డాం. అయితే ప్రస్తుతం గత ప్రభుత్వంలో కంటే ఇసుక ధరలు అధికంగా ఉన్నాయి. సీఎం చంద్రబాబు ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తేనే భవన నిర్మాణ రంగం పటిష్టమవుతుంది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ఇసుక బ్లాక్ మార్కెట్ ఎక్కువైంది. నిజంగా రేవుల్లోకి వెళ్లి ఇసుక కొనుగోలు చేసేపరిస్థితి లేదు. ఇసుక బుక్ చేసుకుంటే రెండు రోజులు పడుతుంది. అదే బ్లాక్‌లో అయితే గంటల వ్యవధిలో ఇసుక ఇంటికి చేరుతుంది. .ఇసుక రీచ్‌లు అన్నీ పనిచేసేలా చర్యలు తీసుకుని ఇసుకను అందుబాటులోకి తీసువస్తే నిర్మాణాలు పెరుగుతాయి. - **బోడా వెంకట్, బిల్డర్,రాజమహేంద్రవరం**

ఇసుకను అందుబాటులోకి తేవాలి..



లక్షలాది మంది భవన నిర్మాణరంగంపై ఆధారపడి జీవిస్తున్నాం. ఇసుక అందుబాటులోకి తీసుకురండి.. గతంలో ఇసుక ధరలు విపరీతంగా పెరిగి ఇబ్బందులు ఎదురయ్యాయి. నిర్మాణాలు ఆగిపోయాయి. భవననిర్మాణ రంగంపై ఆధారపడి జీవించే అన్ని వర్గాల పరిస్థితి దారుణంగా మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఖచ్చితంగా మార్పులు వస్తాయని ఆశించాం. కానీ ఇంత వరకు ఇసుకను అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. చిన్న లారీ ఇసుక (పదిటన్నులు) రూ.13 నుంచి రూ.14 వేలా ఇదెక్కడి అన్యాయమండి. ఇప్పుడు ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఇసుకను వెంటనే అందుబాటులోకి తేవాలి. - **తరుగొప్పులు వెంకన్నబాబు, తాపీమేస్త్రి, రాజమహేంద్రవరం**

తగ్గింపు ధరలకే కందిపప్పు, బియ్యం : జేసీ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19 : జిల్లాలో రైతు బజార్లు, స్పెషల్ కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యాన్ని తగ్గింపు ధరలకు విక్రయాలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జేసీ ఎస్.చినరాముడు అన్నారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం సాయంత్రం పౌరసరఫరాలు, ఇతర సమన్వయ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉల్లిపాయల ధర పెరుగుతున్నందున నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 113 ప్రత్యేక కౌంటర్లు ప్రారంభించి అమ్మకాలు చేస్తున్నామన్నారు. కందిపప్పు బహిరంగ మార్కెట్లో రూ.165 ఉంటే రూ.150లకు, బియ్యం (స్టీమ్) బహిరంగ మార్కెట్లో రూ.55 ఉంటే రూ.48లకు విక్రయిస్తున్నామన్నారు. జిల్లా పౌరసఫరాల అధికారి పి.విజయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

46 కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న గంజాయిని సెబ్ సౌత్ స్టేషన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. తమ సిబ్బందితో దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మూడు ద్విచక్ర వాహనాల్లో ఒడిశాలోని కలిమెల మండలం నాగులూరు గ్రామం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం గ్రామానికి గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. మూడు వాహనాల్లో 46.81 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నాగులూరుకు చెందిన శంకం రాజుబాబు, పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలానికి చెందిన గళ్ల ఐజాక్ రాజు, కలిమెల మండలం పెట్బాల్ గ్రామానికి చెందిన వేలుసేరి బుజ్జి, వేలుసేరి వెంకీలను అదుపులోకి తీసుకున్నామని హనుశ్రీ పేర్కొన్నారు. తనిఖీల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ, ఎస్‌ఐ వై.దుర్గాప్రసాద్, శ్రీనివాసులు, డీటీఎఫ్ ఎస్‌ఐ ఆర్.క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారన్నారు.



జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం

జాంపేట బ్యాంక్ ఛైర్మన్‌గా జయకుమార్

రాజమహేంద్రవరం,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గం ఛైర్మన్‌గా బొమ్మన జయకుమార్, వైస్ ఛైర్మన్‌గా ఆర్.విజయశేఖర్ ఎన్నికయ్యారు. జాంపేట బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌తో పాటు మరో 10 డైరెక్టర్ల చేత రాజమహేంద్రవరం డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్,ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం తొలి సమావేశం జరిగింది. కొత్తగా పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, విజయవాడలలో బ్రాంచిలు పెట్టడానికి రిజర్వు బ్యాంక్ అనుమతిచ్చిందని తెలిపారు. ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ ఫెడరేషన్ ఛైర్మన్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకార రంగం మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు ప్రసాదుల హరనాథ్,ఎం.లక్ష్మణరావు,జామిశెట్టిగాంధీ, ద్వారా పార్వతీ సుందరి, కనకం నాగేశ్వరరావు, బీరా శ్రీనివాసరావు, బూరా రామచంద్రరావు యాండ్రపు రామకృష్ణ, జామికృష్ణ అధికారులు పాల్గొన్నారు.

చవితికి అనుమతి తీసుకోవాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 7న వినాయక చవితి కాలుష్య సమస్యలు లేకుండా నిర్వహించాలని, పందిళ్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ నుంచి డివిజన్,మండల స్థాయి అధికారులతో జేసీ ఎస్.చినరాముడు, డీఆర్వో జి.నరసింహులుతో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.మట్టి విగ్రహాలతో మాత్రమే చవితి వేడుకలు చేసుకోవాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని చెప్పారు.

హాస్టళ్లలో.. కుక్కుడే!



ఎస్సీ హాస్టళ్లలో పరిమితికి మించి విద్యార్థులు

- అటకెక్కుతున్న సంక్షేమం
- 2085 మందికి వసతి
- సౌకర్యాలు శూన్యం
- విద్యార్థినీ..విద్యార్థుల ఇక్కట్లు
- నిబంధనలు గాలికొదిలేసిన వైనం
- పట్టించుకోని అధికారగణం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 19 : సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో అక్రమ అడ్మిషన్లు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. చాలా హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేకపోయినా, పై అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండానే నిబంధనలు బేఖాతరు చేస్తూ హాస్టళ్లలో విద్యార్థులను కుక్కుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు వార్డెన్లు ఉండాల్సిన వారి కంటే ఎక్కువగా విద్యార్థులను జాయిన్ చేసుకోవడంతో అనేక హాస్టళ్లలో పిల్లల సంఖ్య భారీగా పెరిగిపోయింది. దీంతో ఇరుకైన వసతి, సౌకర్యాల లేమితో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జిల్లా వ్యాప్తంగా 35 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ఒక్క దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం ఐడబ్ల్యూహెచ్‌సీ బాలికల హాస్టల్‌కు మాత్రమే 200 శాంక్షన్ స్ట్రెంగ్త్ ఉంది. మిగిలిన 34 హాస్టళ్లలో ఒక్కో హాస్టల్‌కు శాంక్షన్ స్ట్రెంగ్త్ 100 మంది విద్యార్థులు.. అయితే అనేక హాస్టళ్లలో ఈ నిబంధన పాటించడంలేదు.శాంక్షన్ కంటే మించితే ఏఎస్‌డబ్ల్యూవో, డీఎస్‌డబ్ల్యూవో, జిల్లా కలెక్టర్ అనుమతి పొందాలి. ఈ నిబంధనలన్నీ పక్కనపెట్టేసి ఉన్నతాధికారుల అనుమతుల్లేకుండానే కొందరు వార్డెన్లు (హెచ్‌డబ్ల్యూవో)లు స్వలాభంతో ఇష్టారాజ్యంగా విద్యార్థినీ విద్యార్థులను చేర్పించుకుంటూ వారిని ఇబ్బందుల పాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులకు ఇవన్నీ తెలిసినా ఎలాంటి అభ్యంతరం చెప్పకపోగా కనీసం నోరు మెదపకపోవడంలో ఆంతర్యం ఏమిటనేదానిపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలోని అన్ని హాస్టళ్లలోనూ 2,085 మంది విద్యార్థులున్నారు. వీరిలో రెన్యువల్ అయిన విద్యార్థులు 1296 మంది కాగా ఈ ఏడాది కొత్తగా 761 మంది విద్యార్థినీ విద్యార్థులు హాస్టళ్లలో చేరడం గమనార్హం.

పరిమితికి మించి..

శాంక్షన్ స్ట్రెంగ్త్‌కు మించి విద్యార్థినీ విద్యార్థులను జాయిన్ చేసుకుంటే ఆయా హాస్టళ్లలోని పిల్లలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వసతి, వాష్‌రూంలు, ఇతర అన్ని సౌకర్యాల విషయంలోనూ రాజీ పడాలి. ఎందుకంటే శాంక్షన్ మేరకే ప్రతి విద్యార్థికీ బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి. మెస్‌ఛార్జీలు, కాస్మొటిక్ తదితర ఛార్జీలన్నీ నిబంధనల మేరకే ప్రభుత్వం విడుదల చేస్తుంది. పిల్లల సంఖ్యకు అనుగుణంగానే సౌకర్యాలు ఉంటాయి. అయితే కొందరు హాస్టల్ వార్డెన్లు ముందు చూపుతో హాస్టళ్లలో అదనపు ప్రవేశాలకు ద్వారాలు తెరుస్తున్నారు. కొందరైతే అతి తెలివితో మాట్లాడుతున్నారు. ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేస్తున్నారని, దీంతో జాయిన్ చేసుకోక తప్పడంలేదని కొందరు, దళిత సంఘాల నేతల ఒత్తిడి ఉంది అని మరికొందరు చెబుతున్నారు. ఇలా ఏదో ఒక వంకపెట్టి పెద్ద సంఖ్యలో విద్యార్థులను చేర్పించుకుని ఆ తర్వాత అనుమతులు కోరవచ్చనే ఆలోచన చేస్తున్నారు. పిల్లలు చేరిన తర్వాత ఎలాగూ అనుమతులు వస్తాయనే ధీమా చూపుతున్నారు. అయితే సరిగ్గా ఇక్కడే ఒక మెలిక ఉంది. పిల్లలు తక్కువగా ఉంటే బడ్జెట్ తక్కువ వస్తుంది. అదే పిల్లలు ఎక్కువగా ఉంటే బడ్జెట్ భారీగా పెరుగుతుంది. దీంతో హాస్టళ్ల మెయింటెనెన్స్ ఈజీ అవుతుందని,ఎంతో కొంత నొక్కేయవచ్చనే ఆలోచన కొంతమంది వార్డెన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.హాస్టల్ పిల్లలు సదుపాయాలన్నింటిలోనూ సర్దుకుపోవాల్సిన దుస్థితి ఉంటుందని దళిత, ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు.

సౌకర్యాలు శూన్యం..

రాజమహేంద్రవరం గణేష్‌చౌక్‌లోని నెంబర్ - 1 గరల్స్ హాస్టల్‌లో దాదాపుగా 173 మంది విద్యార్థినులకు ప్రవేశం కల్పించారు. ఆఫ్‌లైన్‌లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందనే అనుమానాలున్నాయి.ఇక్కడ శాంక్షన్ స్ట్రెంగ్త్ 100 మంది మాత్రమే అదనంగా మరో 73 మందిని జాయిన్ చేసుకున్నారు. ఎప్పుడో నిర్మించిన పాత భవనంలోనే బాలికల హాస్టల్ నడుపుతున్నారు. సౌకర్యాలు అంతంతమాత్రమే బాత్రూంలు, వసతి విషయంలో హాస్టల్ విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇక్కడ 100 మందికే పూర్తిస్థాయి సౌకర్యాలు లేని పరిస్థితి.. అదనంగా మరో 73 మందికి ప్రవేశం కల్పించడం ఆశ్చర్యం కల్గిస్తుంది. బాలుర హాస్టల్ నెం.1లో 153 మందికి ప్రవేశం కల్పించారు. కాలేజీ బాలుర హాస్టల్ నెం.1లో 112 మంది, కాలేజీ గరల్స్ హాస్టల్ నెం.2లో 130 మంది, దేవరపల్లి చిన్నాయిగూడెం గరల్స్‌హాస్టల్‌లో 240 మందిని జాయిన్ చేసుకున్నారు. ఇలా అనేక హాస్టళ్లలో సౌకర్యాలు లేకపోయినా ఎక్కువగా అడ్మిషన్లు కల్పిస్తూ విద్యార్థులకు నరకం చూపుతున్నారనే విమర్శలున్నాయి. హాస్టల్స్‌కు డిమాండ్ ఉన్నా వసతి, ఇతర కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినీ విద్యార్థులకు నరకప్రాయంగా మారుతోందని చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఈ అక్రమ అడ్మిషన్లపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించకపోతే సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థినీ, విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

పరిమితికి మించి జాయినింగ్స్ నిజమే

హాస్టళ్లకు మంజూరు చేసిన శాంక్షన్ స్ట్రెంగ్త్ కంటే ఎక్కువ మంది పిల్లలను జాయిన్ చేసుకోవడం వల్ల కొంత ఇబ్బంది ఉన్నమాట నిజమే. జిల్లాలో నాలుగైదు హాస్టళ్లలోనే ఇలా ఎక్కువ మంది విద్యార్థులను జాయిన్ చేసుకున్నారు. జిల్లా అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదు. హాస్టళ్ల వార్డెన్ల నుంచి దీనిపై పూర్తి సమగ్ర సమాచారం కోరతా. - **సందీప్, డీఎస్‌డబ్ల్యూవో**

కారులో గంజాయి పట్టివేత 8

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

జన సైనికుడి కుటుంబానికి సాయం

ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

- అధికారులకు కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక
- కలెక్టరేట్‌లో 143 అర్జీల స్వీకరణ
- పలు సమస్యలపై ఫిర్యాదులు



సమస్యలేమిటమ్మా: కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 19 : జిల్లాస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పీజీఆర్‌ఎస్ (ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక) ద్వారా 143 అర్జీలను స్వీకరించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలో ఆర్‌ఎస్‌నెంబరు 472/1, 474/2, 3లలో రాజమహేంద్రవరానికి చెందిన పల్లంటి శ్రీధర్‌కు చెందిన భూమి అన్యాక్రాంతమైందని బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులకు రెవెన్యూ అధికా రులు సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ స్పందించి విచారణ చేపడతామన్నారు. సీతానగరం మండలం చినకొండేపూడికి చెందిన కె.శ్రీనివాస్, రాంబాబు పురుషోత్తపట్నం ఇరిగేషన్ కాలువకు సంబంధించి 106 మందికి పరిహారం చెల్లించలేదని అర్జీపెట్టుకున్నారు. జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు ప్రైవేట్ విద్యాసంస్థలు తూట్లు పొడుస్తున్నాయని ఫిర్యాదు చేశారు. హెల్త్ విభాగంలో సెకండ్ ఏఎన్‌ఎంలు గా పనిచేసిన తమను సచివాలయాలకు తీసుకున్నారని ఇప్పుడు తిరిగి మాతృసంస్థకు పంపాలని ఏఎన్‌ఎంలు కోరారు. పౌరసరఫరాల శాఖకు 36, పోలీస్ శాఖకు 25, పంచాయితీరాజ్‌కు 16, పురపాలక శాఖకు 10, ఇతర శాఖలకు 21 అర్జీలు వచ్చాయని జేసీ చిన రాముడు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు , దిశ స్టేషన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణనాయక్, టూరిజం ఆర్‌డీ వి.స్వామి నాయుడు, పౌరసరఫరాల డీఎం టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గారి ఇలాఖాలో..నిర్లక్ష్యమా!

నిడదవోలు, ఆగస్టు 19 : ఒక మంత్రి నియోజకవర్గంలో ఉన్నామన్న భయం అధికారుల్లో కానరా వడంలేదు.. గత ప్రభుత్వంలో ఎలాగైతే ప్రవర్తిం చారో నేటికీ అలాగే ఉంది అధికారుల తీరు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుంది.ఈ కార్యక్రమానికి స్థానిక అధికారులు హాజరై హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.అయితే మంత్రి కందుల దుర్గేష్ నియోజకవర్గ కేంద్రం నిడదవోలు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 మంది మండలస్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే హాజర య్యారు. క్షేత్రస్థాయి పర్యటనలు ఏమైనా ఉన్నా యా అంటే అదీ లేదు. గత వారమూ ఇంతే. ఎందుకో మరి ప్రభుత్వ కార్యక్రమంపై నిర్లక్ష్యం చూపుతున్నారు. గత సోమవారం నిడదవోలులో జరిగిన కార్యక్రమానికి 13 మంది మాత్రమే హాజరుకాగా ఈ వారం 12 మంది మాత్రమే హాజరవడం విశేషం.అయితే అయా శాఖల అధికారులను కలిసేందుకు వచ్చిన జనం మాత్రం సమస్యలు ఎవరికీ చెప్పాలోతెలియక నిరాశగా వెనుతిరుగుతున్నారు.



నిడదవోలులో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు హాజరైన అధికారులు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

టీడీపీ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేత



ప్రశంసాపత్రాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 19: టీడీపీ కంటెంట్‌ను సోషల్‌మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లిన ఐదుగురు కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందించారు. యువగళం పాదయాత్ర ప్రారంభం నుంచి సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం వరకు టీడీపీ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి వెళ్లే విధంగా ప్రచారం చేసిన పార్టీ కార్యకర్తలు యనమదల సుబ్రహ్మణ్యం, యంగళ ఉదయభాస్కర్, సయ్యద్ అన్వర్ బాషా, కాకర్ల సత్యేంద్ర, సుంకవల్లి సాయికిరణ్‌లకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రశంసాపత్రాలను పంపించారు. వాటిని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు ఎమ్మెల్యే ముప్పిడి అందజేశారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, బేతిన నారాయణ, నాదెళ్ల శ్రీరామ్, కలగర సుబ్బారావు, పరిమి గణేష్, నాయుడు వీర్రాజు పాల్గొన్నారు.

జనసైనికుడి కుటుంబానికి బీమా సొమ్ము అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి, ఆగస్టు 19: జనసైనికులకు అనుకోని ప్రమాదం నుంచి రక్షణ కల్పించేందుకు క్రియాశీలక సభ్యత్వం ద్వారా బీమా సౌకర్యం కల్పిస్తున్నామని పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. అన్నవరప్పాడులో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన సాదిరెడ్డి గౌతం(24) జనసైనికుడి కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.5 లక్షల బీమా సొమ్ము చెక్కును సోమవారం సాయంత్రం ఆ కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుకోని విధంగా ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులు, మృతిచెందిన జనసైనికుల కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా జనసేనాని పవన్‌కల్యాణ్ ఈ పథకం ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఎంతో మందికి ఇది ఉపయోగపడిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు పది లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని, నియోజకవర్గంలో 15,150 సభ్యత్వాలు నమోదైనట్టు తెలిపారు. కార్యక్రమంలో పొప్పొప్పు సూర్యనాగేశ్వరరావు, పిప్పర రవి, పులపర్తి తాతాబ్బాయి, ఆకుల సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు రాట మంచి

చాగల్లు, ఆగస్టు 19: చాగల్లులో సంపత్ వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవాలకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరిరాట కార్యక్రమం జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గ్రంధి రాంబాబు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలు, సినీ సంగీత విభావరి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఉత్తమ విద్యార్థులకు బహుమతి ప్రదానం జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రంధి వెంకటేశ్వరరావు, జాను గంగారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం అందించాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు సత్యం

నల్లజర్ల, ఆగస్టు 19: రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. నల్లజర్ల సొసైటీ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన విశ్రాంత ఉద్యోగుల సంఘం రెండో వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పెన్షనర్లకు వైద్య పథకం నిమిత్తం ప్రభుత్వం మినహాయిస్తున్న నగదుకు రెట్టింపు వసూలు చేసి నగదు రహిత వైద్యాన్ని అందించాలన్నారు. జిల్లా కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్‌ను దహనం చేస్తున్న నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు,పెన్షనర్లకు బకాయిపడ్డ మొత్తాలను దశల వారీగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఎస్ఎం ఆలీసాహెబ్, దేవరపల్లి అధ్యక్షుడు పప్పు రామారావు, సుంకర దత్తు, ఝాన్సీ లక్ష్మి, ఎస్.బాలయ్య నెక్కలపూడి ప్రసాద్, ఐ.అప్పారావు పాల్గొన్నారు.

బాబ్జీ కుటుంబానికి మంత్రి శ్రీనివాస్ పరామర్శ



బాబ్జీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీనివాస్

తాళ్లపూడి, ఆగస్టు 19: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు ఇల్లూరి బాబ్జీ కుటుంబాన్ని విజయనగరం జిల్లా గజపతి నగర ఎమ్మెల్యే, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. మండలంలో పార్టీకి ఎనలేని సేవలందించిన బాబ్జి మృతి టీడీపీకి తీరని లోటని నాయకులు అన్నారు.

అపుస్మా గోపాలపురం చైర్మన్‌గా ఫణికిషోర్

గోపాలపురం, ఆగస్టు 19: ప్రైవేటు పాఠశాలల నియోజకవర్గ చైర్మన్‌గా గోపాలపురం శార్వాణీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ రాపాక ఫణికిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అన్ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక శార్వాణీ పాఠశాలలో అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. జోన్ అధ్యక్షుడిగా రాపాక ఫణి కిషోర్, ప్రధాన కార్యదర్శిగా జీఎస్ఆర్ రెడ్డి, కోశాధికారిగా కె.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో అపుస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి పెనకటి శివాజి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రవిబాబు, రాష్ట్ర ఈసీ మెంబరు రవిచంద్ర, ఎ.సుధీర్‌కుమార్, గూడపాటి ఏడుకొండలు, ఉషోదయ చెల్లారావు, గీతాంజలి రాజయ్య, మెహర్ శ్రీకృష్ణ, బాబూజీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ నిడదవోలు అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసరావు



నిడదవోలు, ఆగస్టు 19: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నిడదవోలు అసోసియేషన్ అధ్యక్షుడిగా పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ నెక్కంటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా డాక్టర్ పరిమి వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఐఎంఏ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. శ్రీనివాసరావు, వినోద్‌లను పలువురు వైద్యులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా రేపు భారత్ బంద్

మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం

కొవ్వూరు, ఆగస్టు 19: ఈ నెల 21వ తేదీన జరగనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని, ఎస్టీల గురించి అడగకపోయినా ఎస్సీ, ఎస్టీలకు క్రిమిలేయర్ వర్తిస్తుందని పేర్కొనడం దుర్మార్గమన్నారు. అస్పృశ్యత ఆధారంగా ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించారని, నేడు ఆ రిజర్వేషన్లు ఎత్తివేయడానికి కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేశారన్నారు. ఈ నెల 21న జరగనున్న భారత్‌బంద్‌కు విద్య, వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోటల్స్ మద్దతు ఇవ్వాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆరు ఫిర్యాదులు

కొవ్వూరు, ఆగస్టు 19: కొవ్వూరు డివిజన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 6 ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు ప్రణాళిక రూపొందించాలి

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- దేవరపల్లిలో ముంపు ప్రాంతాల పరిశీలన

దేవరపల్లి, ఆగస్టు 19: రామన్నపాలెంలో పొలాలు, ఇళ్లు ముంపునకు గురి కాకుండా తీసుకోవల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధికారులను ఆదేశించారు. మండలం లోని ధూమంతన గూడెం, రామన్నపాలెం, దేవరపల్లి గ్రామాల్లో వర్షాల వల్ల ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ధూమంతనగూడెంలో తాడిపూడి కాల్వలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను పరిశీలించారు. రామన్నపాలెంలో వరద నీరు వల్ల దుర్గమ్మ గుడి వెనుకభాగంలో ఉన్న పొలాలతో పాటు ఇళ్లు కూడా మునిగిపోతాయని టీడీపీ నాయకులు పరిమి శ్రీరామకృష్ణ, ముమ్మారెడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వర్షపునీరు వెళ్లే మార్గంలేక ముంపుకు గురవుతున్నాయని చెప్పగా ఆయన స్పందిస్తూ ముంపునకు గురి కాకుండా తీసుకోవల్సిన చర్యలపై చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో కమ్యూనిటీ హాలు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, మంచినీటి ట్యాంకు నిర్మిస్తాని, జడ్పీ హైస్కూల్లో లేబరేటరిని పరిశీలించి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. క్రీడా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయులు పేరం రవీంద్రనాథ్‌ను అభినందించారు. దేవరపల్లిలో ఇటీవల వర్షాల వలన ముంపుకు గురైన ప్రాంతాలను టీడీపీ నేతలు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావులతో పరిశీలించి వెంటనే నిధులు కేటాయించి అవసరమైన చోట వంతెన నిర్మాణం, డ్రైన్ల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్ఐ వెంకటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు అంద్రూ అనీల్, నుదురుమాటి శ్రీనివాస్, ముళ్ళపూడి దొరాజీ చౌదరి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మద్దిపాటికి వినతిపత్రం అందిస్తున్న బీసీ నాయకులు

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

గోపాలపురం, ఆగస్టు 19: మండలంలో త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు నల్లజర్ల క్యాంపు కార్యాలయంలో బీసీ సంఘం నాయకులు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాలపురం మండలంలో త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవుల్లో గ్రామాల్లో టీడీపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న బీసీలకు స్థానం కల్పించాలని కోరినట్టు చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు బీసీలు టీడీపీ వెన్నంటి ఉన్నారని, అలాంటి వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చి గుర్తించాలని ఎమ్మెల్యేను కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు దుర్గారావు, సోమరాజు, నాయకులు సోమరాజు, బిక్కవోలు నాగేశ్వరరావు, మగ్గల్‌బాష, వేముల నాగరాజు, సత్యనారాయణ, అనిశెట్టి త్రిమూర్తులు రాజంపాలెం ఎస్ఎంసీ చైర్మన్ శ్రీను, ఎస్కే ఖాసిం, బుజ్జి పాల్గొన్నారు.



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కారులో గంజాయి పట్టివేత

● 25 కిలోలు స్వాధీనం.. ఏడుగురి అరెస్టు

కొవ్వూరు, ఆగస్టు 19: గంజాయి రవాణాచేస్తున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 25.130కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం ఎస్ఐ కె.జగన్మోహన్, లీగల్ మెట్రాలజి అధికారులు, రెవెన్యూ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో సర్వీస్‌రోడ్‌లో మారుతి కారు అనుమానాస్పదంగా వస్తుండడంతో ఆపి తనిఖీ చేశారు. కొవ్వూరు కోట్ల వారి వీధికి చెందిన రౌడీషీటర్ కంచుబాణి దినకర్, ఇందిరమ్మకాలనీకి చెందిన భూపతి అశోక్, భూపతి అశ్వర్థ, దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన కడింపల్లి సిద్ధార్థ, దేవరపల్లి మండలం యర్నగూడెం పాతపేటకు చెందిన గీసాల రవికుమార్, కొరివేటి పోసికుమార్, పోలవరం హైస్కూల్ రోడ్డుకు చెందిన చెట్టిబత్తుల హర్షవర్ధన్‌లు అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల గ్రామంలో కొనుగోలు చేసి కారులో రెండు బ్యాగ్‌లుగా పార్సిల్ చేసి తీసుకువస్తున్న 25.130 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.75 వేలు ఉంటుందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణ అనంతరం కొవ్వూరు, రాజానగరం, దేవరపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగిన ఐదు దొంగతనాలకు సంబంధించిన ఆస్తిని రికవరీ చేశామని సీఐ చెప్పారు. 2024 జూన్ నుంచి జూలై 17 వరకూ కొవ్వూరు, దొమ్మేరులోని జగనన్నకాలనీ, దేవరపల్లి మండలం కృష్ణంపాలెం, గౌరీపట్నం, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరులో జరిగిన చోరీ కేసుల్లోని రూ.11,81,000 విలువైన వస్తువులను రికవరీ చేసినట్టు చెప్పారు. గంజాయి రవాణాతో పాటు ఈ ఐదు కేసుల్లో ఏడుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ విశ్వం తెలిపారు.

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

కోలమూరులో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా ఘటన



మృతుడు రాజు

రాజానగరం, ఆగస్టు 19: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంతమూ రులోని ఎన్‌వీబీ లేఅవుట్‌లో విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి చెందినట్టు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ సోమవారం తెలిపారు. తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన కొక్కిరిపాటి రాజు(55) గౌరీపట్నం క్వారీ నుంచి గ్రావెల్ లోడు చేసుకుని రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు చేరుకున్నాడు. స్థానిక ఎన్‌వీబీ లేఅవుట్‌లో ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా పైనున్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. మృతుడి అల్లుడు ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలేనికి చెందిన ఉండ్రాజవరపు పాపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మనోహర్ తెలిపారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

కొవ్వూరు, ఆగస్టు 19: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై చాకుతో దాడిచేసి గాయపర్చిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. ఈ నెల 18న కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లోని మద్యం షాపులో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఖండవల్లి జయరాజును పిండి సుబ్రహ్మణ్యం చాకుతో ముఖం, తల, చేతులు, చాతిపై గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని ఎస్ఐ కె.జగన్మోహన్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయగా విచారణ అనంతరం సోమవారం ఉదయం సుబ్రహ్మణ్యంను డీఎస్పీ దేవకుమార్ అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

పాలంగిలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన



పాలంగిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఆగస్టు 19: కలకత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం ఘటనకు నిరసనగా మండలంలోని పాలంగిలో సోమవారం రాత్రి సర్పంచ్ బొక్కా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్‌ను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీవీఎస్ రామారావు, వార్డు సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం పంచాయతీ బోర్డు సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

చాగల్లు ఎంపీపీ వీరాస్వామి

- గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు



చాగల్లు ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభ దృశ్యం

చాగల్లు, ఆగస్టు 19: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ ఎం.వీరాస్వామి అన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు మాట్లాడుతూ చెత్త సేకరణతో సంపద సృష్టించాలని, తాగునీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణ, బహిరంగ మలవిసర్జన చేయకుండా సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, ఈవోపీఆర్డీ శ్రవణ్‌కుమార్, రిసోర్సుపర్సన్లుగా ఆర్ఎస్‌వీ సుబ్బారావు, శివ హరిబాబు, జగజ్జీవనరావు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా తరగతులకు ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు మాట్లాడుతూ సర్పంచులకు పరిపాలనా పరమైన అవగాహన కలిపించడంతో పాటు వారికి గౌరవాన్ని అందించే ప్రొటోకాల్ విధానంపై అవగాహన కల్పించామన్నారు. ముందుగా మహిళా సర్పంచులు జ్యోతి ప్రజ్వలన చేయగా ఎంపీపీ మహాత్ముల చిత్రపటాలకు పూలమాలలు వేసి అనంతరం మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులుగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కొన్ని కొన్ని సమయాల్లో నాయకులు ప్రొటోకాల్ పరిధి దాటి వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ, సూపరింటెండెంట్ రామారావు, ఎస్ఏ అమ్మిరాజు, డీపీఎం ప్రసంగిరాజు, ట్రైనింగ్ పొందిన కార్యదర్శులు ఆశాలేఖ్య, ఆశా సువర్చల పలు అంశాలను సర్పంచులకు వివరించారు. సమావేశానికి మండలంలోని అన్నిగ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సింహాద్రిరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, తడిచెత్త, పొడిచెత్త సేకరణ, వేరు చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మీ నారాయణ, సర్పంచ్‌లు నందమూరి శారదదేవి, బండి చిట్టి, జార్జ్ విక్టర్, మద్దిపాటి శ్రీను, గాలింకి మల్లిక పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ కార్చెర్ల సీతారామ్ ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు సంయుక్తంగా పనిచేయాలన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు నడిపల్లిలో, మూడో రోజు పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, అధికారులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో శిక్షణ కార్యక్రమం ప్రారంభ దృశ్యం



నల్లజర్లలో శిక్షణ ఇస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సింహాద్రిరావు



పెరవలిలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

- చాగల్లు పీఎంపీ వెల్ఫేర్ అసోసియేసన్
- పలుచోట్ల నిరసన ర్యాలీలు

చాగల్లు, ఆగస్టు 20: కలకత్తా జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి చాగల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద మండల పీఎంపీ వెల్ఫేర్ అసోసియేసన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, పీఎంపీలు ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ తనూజ, టి.మనోజ్, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు ఎం.చక్రవర్తి, మల్లేశ్వరరావు, ఆనంద్‌కుమార్, సూర్యప్రకాష్, ఎస్కే బాష తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురంలో ఉపాధ్యాయ సంఘాలు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టాయి. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ నినాదాలు చేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు, బాలికలపై ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించడానికి ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలులోకి తీసుకురావాలని అన్నారు.

దేవరపల్లి: యూటీఎఫ్ మహిళా అధ్యక్షురాలు రమాజానకి, విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని యర్నగూడెం, దుద్దుకూరు హైస్కూల్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు ఓరుగంటి శివరామరాజు, నాగేంద్రప్రసాద్, రమాజానకి మాట్లా డుతూ హత్యాచారానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, రాజకీయ అండ ఉన్నా, శ్రీమంతుల పిల్లలైనా శిక్షించాల్సిందేనన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చాగల్లులో నిరసన తెలుపుతున్న పీఎంపీలు



గోపాలపురంలో ఉపాధ్యాయ సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ



దేవరపల్లి: దుద్దుకూరులో కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం

కొవ్వూరు, ఆగస్టు 19: ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని సోమవారం కొవ్వూరులో ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గెల్లా రాజు ఆధ్వర్యంలో లూయిస్ డాగ్‌రే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఫొటోగ్రాఫర్స్‌కు ముద్ర రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు యు.అప్పన్నశ్రీను, డి.శ్రీను, పి.రవి, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరిదేవికి సహస్ర తామర పూజ



కొవ్వూరు, ఆగస్టు 19: శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీబాలాత్రిపుర సుందరీ దేవికి సోమవారం సహస్ర తామరపూజ నిర్వహించారు. ఆలయార్చకులు సుందరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు. 1000 తామరపువ్వులతో పూజ, 108 తామర పువ్వులతో శ్రీసూక్త హోమం చేశారు. కొవ్వూరు పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లిలో మహాలక్ష్మి హోమం

దేవర పల్లి, ఆగస్టు 19: దేవరపల్లిలోని ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం మహాలక్ష్మి హోమం నిర్వహించారు. మహిళా భక్తులు సౌందర్యలహరి పారాయణం చేపట్టారు. వేదపండితులు మహాలక్ష్మి హోమం చేశారు. ఉదయం నుంచి ఆలయంలో సరస్వతిదేవికి అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ హరినాథ్, నారాయణ విశ్వేశ్వరరావు, తోట సత్యనారాయణ, సౌందర్యలహరి మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోదావరి మాతకు నీరాజనం

కొవ్వూరు, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమి సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు గోదావరి నీరాజన సమితి ఆధ్వర్యంలో సోమవారం మహానీరాజనం అందజేశారు. ఈ సందర్భంగా క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలోని గోదావరిమాతకు సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో అష్టోత్తర శత కుంకుమార్చనలు నిర్వహించి, వివిధ రకాల హారతులతో మహానీరాజనం అందజేశారు. అనంతరం మహిళలు నేతి దీపాలను వెలిగించి గోదావరి నదిలో వదిలారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంస్కృత దినోత్సవం..

కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో సంస్కృత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి జక్కంపూడి విజయలక్ష్మి, ఉజిసిస్ దేశం అంబాసిడర్ చీమలమర్రి శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాల తెలుగు అధ్యక్షుడు సంజీవరావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. సంస్కృత భాషపై అభిమానంతో ఉజిసిస్ దేశస్థులు విడుదల చేసిన స్టాంప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలు అందజేత

కొవ్వూరు, ఆగస్టు 19: దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో 16మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. కృత్రిమ అవయవాల కోసం 26 మంది నెల్లూరు వెళ్లి రావడానికి దాతలు సహకారం అందజేశారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జె.వెంకటేశ్వరరావు, ప్రత్తిపాటి అబెడ్నెగో, అనపర్తి రాజు, ప్రభాస్, సుధాకర్ పాల్గొన్నారు.